RNI NO. TELTEL/2022/83470 ●manasakshi.in

# మనసాక్షి
మీకోసం
తెలుగు దినపత్రిక
ఎడిటర్: మల్లె నాగిరెడ్డి

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 4. సంచిక :187 | శనివారం 21 మార్చి 2026 | పేజీలు 8 | వెల: రూ.1.00 | epaper.manasakshi.in

## 300 బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌పై నిషేధం



న్యూఢిల్లీ:,మనసాక్షి: అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌పై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. 300 బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌పై నిషేధం విధించింది. వీటిలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్ ఎ÷-లాట్‌ఫామ్స్, బెట్టింగ్ ఎక్స్ఛేంజీలు, సట్టా/మట్కా గ్యాంబ్లింగ్ నెట్‌వర్క్‌లు, రియల్‌మనీ కార్డ్-కెసినో గేమ్ యాప్స్ ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు ఇలాంటి 8,400 వెబ్‌సైట్లు, యాప్స్‌ను నిషేధించింది. బెట్టింగ్, ఆన్‌లైన్ జూదం కారణంగా యువత పెడదోవ పట్టడం, ఆర్థికంగా చితికిపోతున్నట్లు గ్రహించిన కేంద్ర ప్రభుత్వం.. గతేడాది అక్టోబర్‌లో ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్, 2025ను తీసుకొచ్చింది. నగదుతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించింది. ఈ చట్టం అమల్లోకి వచ్చాక 4900 వెబ్‌సైట్లు/యాప్‌లపై చర్యలు చేపట్టింది.

మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు మహాలక్ష్మీ పథకం.. రూ.4,305 కోట్లు ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు, చేయూత పథకం.. రూ.14,861 కోట్లు, రైతు భరోసా.. రూ.18 వేల కోట్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు

మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లు

ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు

1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా

జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయింపు



2లో..

# రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్

- విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు
- వ్యవసాయ శాఖకు రూ.23,179 కోట్లు
- విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు
- పౌరసరఫరాల శాఖకు రూ.7,366 కోట్లు
- పశుసంవర్ధక శాఖకు రూ.1,529 కోట్లు
- విద్యా శాఖకు రూ.26,674 కోట్లు
- వైద్య శాఖకు రూ.13,679 కోట్లు
- కార్మిక శాఖకు రూ.998 కోట్లు
- మహిళ, శిశు సంక్షేమ శాఖకు రూ.3,143 కోట్లు
- ఎస్సీ సంక్షేమం.. రూ.11,784 కోట్లు,
- ఎస్టీ సంక్షేమం.. రూ.7,934 కోట్లు
- బీసీ సంక్షేమం.. రూ.12,511 కోట్లు
- మైనార్టీ సంక్షేమం.. రూ.3,769 కోట్లు
- ఉపకార వేతనాలకు రూ.4,343 కోట్లు
- యంగ్ ఇండియా స్కూళ్లకు రూ.5 వేల కోట్లు



'మేం పాలకులం కాదు.. ప్రజలకు సేవకులం' అని భట్టి విక్రమార్క తెలిపారు.రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అంబేద్కర్ అడుగు జాడల్లోనే పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. అటు శాసనమండలిలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ అంటే అంకెల చుట్టూ తిరగడం కాదని, అభివృద్ధి సంఖ్యలను ఆవిష్కరించడమని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా తాము చేస్తున్న కృషికి బడ్జెట్ తార్కాణమని, గత రెండేళ్ల అభివృద్ధి ఇందుకు నిదర్శనమని అన్నారు.

# ఆరు గ్యారెంటీలపై నిలదీస్తూనే ఉంటాం






### గన్ పార్క్ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన

### ప్లకార్డులతో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శన

హైదరాబాద్:,మనసాక్షి:ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గన్‌పార్క్ నుంచి అసెంబ్లీకి ర్యాలీకి బయల్దేరి వచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యమని గ్యారంటీ కార్డులు ఇచ్చి భద్రం చేసుకోమన్నారని గుర్తుచేశారు. ఇంతవరకు ఒక్క గ్యారంటీని నెరవేర్చిందని లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల తరఫున వృద్ధులు, వితంతువుల తరఫున బడ్జెట్ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. రూ.2500 మహాలక్ష్మి నిధులు ఎప్పుడిస్తారని నిలదీస్తామని తెలిపారు. కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు నీటిమూటలయ్యాయని విమర్శించారు. బడ్జెట్‌లో రైతులకు, బీసీలకు జరుగుతున్న అన్యాయంపై నిలదీస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. సంక్రాంతి, ఉగాది గడిచినా రైతు భరోసా పడలేదని అన్నారు. ఉద్యోగాలపై బొంకుతున్న కాంగ్రెస్‌ను అసెంబ్లీలో నిలదీస్తామని తెలిపారు. హామీలపై అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. చట్టసభల్లో చర్చ అంటేనే ప్రభుత్వం లాగు తడుస్తోందని మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనచారి ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలు లేవనెత్తిన అంశాలకు అసెంబ్లీలో జవాబు ఇవ్వని పరిస్థితి ఉందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండటం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలను బుల్డోజ్ చేస్తుందని మధుసూదనచారి మండిపడ్డారు. ప్రతిపక్షాలు అడిగిన ఏ ఒక్కదానికీ జవాబివ్వని పరిస్థితి ఉందని విమర్శించారు. మేం లేవనెత్తిన అంశలపై పలాయనం చిత్తగించడం కనిపిస్తోందని అన్నారు. ఎగవేతలు, ఎదురుదాడి, అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్రలో ఇంత బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదని అన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని అన్నారు. ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతామని హెచ్చరించారు.

## తెలంగాణ విద్యారంగంలో కీలక మార్పులకు కసరత్తులు



2లో..

- ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే ముందుకు
- హరీష్ రావుకు ట్యాపింగ్‌లో ఊరట అబద్ధం
- పదో తరగతి పరీక్షలు లేకుండా 12 తరగతులు
- కమిటీ అధ్యయనం తరవాత విస్తృతస్థాయిలో ప్రజాభిప్రాయం
- మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశాం
- రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం అప్పలకు చెల్లించాం

కెసిఆర్‌ను గృహనిర్బంధం చేసిన క ఎటిఆర్, హరీష్ రావు హిల్టు టీడీఆర్ భూ బదలాయింపులపై ఎలాంటి విచారణకైనా సిద్ధం డ్రగ్స్‌పై నోరుమెదపని బిజెపి, బిఆర్ఎస్ నేతలు మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

తెలంగాణ జాతిపిత ఎవరో ప్రజలు డిసైడ్ చేయాలన్నారు. ఏ గ్యారంటీ ఎప్పుడు అమలు చేయాలో తమ దగ్గర ప్రణాళిక ఉందని సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. బిఆర్ఎస్ నేతలు చెబితే చేయాలని లేదన్నారు. అందుకే వారు అక్కడ ఉన్నారు..మేము ఇక్కడ ఉన్నామని అన్నారు. కేసీఆర్ హయాంలో అప్పులు, తప్పులు కప్పిపుచ్చి పాలన చేశారని ఎద్దేవా చేశారు.

## బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు...ప్రగల్భాలు



2లో..

అప్పలకోసం చేసే ప్రయత్నాలే ఎక్కువ

బడ్జెట్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

## బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం

- ఆరు గ్యారంటీలకు సమాధి కట్టారు
- మహిళల పెన్షన్‌పై మాట్లాడని బడ్జెట్
- పేదలపట్ల చిత్తశుద్ధి లేని బడ్జెట్ ఇది

భట్టి కేటాయింపులపై హరీష్ రావు పెదవివిరుపు



2లో..

## అంతర్జాతీయ ప్రమాణాలతో విపత్తుల శిక్షణా కేంద్రం



డిజాస్టర్ మేనేజిమెంట్‌పై మంత్రి పొంగులేటి సమీక్ష

హైదరాబాద్,అంతర్జాతీయ ప్రమాణాలతో రాష్ట్ర విపత్తుల నిర్వహణ శిక్షణా కేంద్రాన్నిఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం సంబంధిత విభాగాల నుంచి ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసుకొని కార్యాచరణ రూపొందించాలని సూచించారు. దీనిపై గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖలకు విపత్తు నిర్వహణపై ఒకే విధమైన శిక్షణను అందించడం, శాస్త్రీయ పద్ధతుల ద్వారా ప్రాణ నష్టాన్ని, ఆర్థిక నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించడం, క్షేత్రస్థాయిలో, ముఖ్యంగా జిల్లాల్లో విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంపొందించడం. విపత్తుల నివారణకు సంబంధించి ఇది ఒక అత్యున్నత పరిశోధన మరియు పాలసీ సపోర్ట్ కేంద్రంగా పనిచేస్తుందని అన్నారు. శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ఫైర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగాలతో మంత్రి గారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ విపత్తులు సంభవించినప్పుడు కేవలం సహాయక చర్యలకే పరిమితం కాకుండా, ముందస్తు సన్నద్ధతతో నష్టాన్ని తగ్గించే లక్ష్యంతో 'స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్' ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. విపత్తుల నిర్వహణలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలిపేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

## ఎల్వీజిని ప్రజలకు అందుబాటులో ఉంచాలి



2లో..



2లో..

## మరోమారు పెరిగిన బంగారం ధరలు

పదిగ్రాముల బంగారంపై 650 పెరుగుదల

లాభాలతో మొదలైన స్టాక్ మార్కెట్లు

## అకాల వర్షంతో అన్నదాతల కుదేలు



2లో..

- దెబ్బతిన్న పలు రకాల పంటలు
- భారీగా నష్టపోయామని ఆందోళన
- రైతులను ఆదుకుంటామన్న మంత్రి అచ్చన్నాయుడు

## రూ.3,24,234 కోట్లతో రాష్ట్ర బడ్జెట్



హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రవేశపెట్టారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2026-27 తెలంగాణ బ్జడెట్‌లో 'ప్రజా క్షేమం సామాజిక న్యాయం' అనే నినాదంతో ముందుకు సాగింది. సంక్షేమం, మౌలిక సదుపాయాలకు సమ ప్రాధాన్యతనిస్తూ, వ్యవసాయం, విద్య, మౌళిక సదుపాయాలు తదితర రంగాలకు భారీగా నిధులు కేటాయించారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, ప్రజా క్షేమం, సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది సర్కార్. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. మొత్తం బడ్జెట్.. రూ.3,24,234 కోట్లు కాగా, అందులో రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లుగా చూపారు. బడ్జెట్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే.. 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు కేటాయించారు. బడ్జెట్ లో 5 కీలక రంగాలకు భట్టి ప్రాధాన్యతనిచ్చారు. వ్యవసాయం, రైతు సంక్షేమం రూ. 23,179 కోట్లు కేటాయించారు. రైతులకు పెట్టుబడి సాయం అందించే రైతు భరోసా, పంట బీమా, రుణమాఫీ పథకాలకు తెలంగాణ బడ్జెట్లో అగ్రతాంబూలం ఇచ్చారు. సన్న రకం వడ్లకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇవ్వడంపై ప్రత్యేక దృష్టి సారించారు. సర్కారు విద్యారంగానికి భారీగా నిధులు కేటాయించింది. విద్య, నైపుణ్యాభివృద్ధి రూ. 26,674 కోట్లు కేటాయించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరిట అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకుల పాఠశాలల నిర్మాణం, స్కిల్ యూనివర్సిటీతో యువతకు ఉపాధి కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లకు భారీగా నిధులు కేటాయించారు. ప్రజా పాలన - ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్), రూ. 500 కే గ్యాస్ సిలిండర్ వంటి ఆరు గ్యారెంటీల అమలుకు అవసర మైన నిధులను పుష్కలంగా కేటాయించారు.. మౌలిక సదుపాయాలకు గాను మూలధన వ్యయం రూ. 47,267 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో రోడ్లు, భవనాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా శాశ్వత ఆస్తుల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చారు. గత పాలనలో ఆగిపోయిన పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టారు. సామాజిక భద్రత లోబీమా పథకాలను చేర్చారు. ప్రతి పేద కుటుంబానికి భీమా కల్పించేందుకు 'ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకం' కింద రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడం ఈ బడ్జెట్‌లో ఒక కీలక అడుగుగాభావించాలి. జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు చేస్తారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రకటించారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం.

## బడ్జెట్ కేటాయింపులు అధ్వాన్నం



హైదరాబాద్: తెలంగాణ బడ్జెట్‌పై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు పెదవి విరిచారు. ఇదొక ఝూటా బ్జడెట్ అని, బోగస్ బడ్జెట్ అని ఆయన మండిపడ్డారు. ఈ బడ్జెట్‌తో ప్రభుత్వం అన్ని వర్గాల వారిని మోసం చేసిందని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలను, ఆర్టీసీ కార్మికుల సమస్యలను, నిరుద్యోగల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. వృద్ధులకు, వికలాంగులకు ఇచ్చిన పించన్ పెంపు హామీలను కూడా సర్కారు మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. మహిళలకు నెలకు రూ.2,500 పెన్షన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇందులో సకలజనుల దక్కింది గుండు సున్నా తప్ప ఏమీ లేదని హరీష్‌రావు విమర్శించారు. అంకెలగారడీ, మాటల గారడీ తప్ప ప్రభుత్వానికి పేదలపట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదనే విషయం ఈ బడ్జెట్ ద్వారా అర్థమవుతోందని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజలకు అభయహస్తమని హామీ ఇచ్చారని, ఇప్పుడు మూడో బడ్జెట్‌లో కూడా రిక్తహస్తమే మిగిల్చారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లు కాలేదుగానీ మూడున్నర లక్షల కోట్లు అప్పులు చేసిందని, తెచ్చిన ఆ అప్పుతో ఏం చేశారని ప్రభుత్వాన్ని నిలదీశారు. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడితే.. కాంగ్రెస్ తన రెండున్నరేళ్ల పాలనలో వెనుకపడేసిందని హరీష్‌రావు విమర్శించారు. బడ్జెట్ ప్రసంగం సందర్భంగా భట్టి అంబేద్కర్ సూక్తులు, రాజ్యాంగ విలువలను వల్లెవేశారని, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను వెనుక కూసోబెట్టుకుని రాజ్యాంగ విలువల గురించి ఆయన మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క గోరీ కట్టారని దెప్పిపొడిచారు. ఈ బ్జడెట్‌ను చూస్తే ఎన్నికల హామీలపై కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమైందని అన్నారు. గతం కంటే 20పేజీలు పెంచారు తప్ప.. హామీలకు కేటాయింపులు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారని ధ్వజమెత్తారు. సీఎం ప్రజలకే కాదని.. ఎమ్మెల్యేలకు సైతం అందుబాటులో ఉండటం లేదని హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో 3లక్షల పింఛన్లు కట్ చేసి.. 2లక్షల కొత్త పెన్షన్లు ఇస్తామంటున్నారని అన్నారు. కోటీశ్వరులు సంగతి అటుంచి.. మొదట మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్, ఇందిరమ్మ పేర్లతో అమలవుతోన్న స్కీంలకు సైతం కేటాయింపులు ఎందుకు చేయలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్‌ది.. అభయ హస్తం కాదని.. రిక్త హస్తమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది మూడు ముక్కలాట తప్ప.. విజన్ లేదని దెప్పిపొడిచారు. బ్జడెట్‌లో అన్నివర్గాలకు మొండి చెయ్యి చూపారని ఆగ్రహించారు. మూడున్నర లక్షల కోట్లు అప్పులు తెచ్చి.. రేవంత్ చేసిందేమీ లేదని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో సచివాలయం, కాళేశ్వరం, చెక్ డ్యాంలు కట్టామని ప్రస్తావించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను వెనుక కూర్చోపెట్టుకుని భట్టి.. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహించారు. కాంగ్రెస్ హయాంలో స్కాంలు తప్ప.. స్కీంలు లేవని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

## తెలంగాణ విద్యారంగంలో కీలక మార్పులకు కసరత్తులు



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ విషయంలో చట్టప్రకారమే ముందుకు వెళ్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కేసులో కీలక నిందితుడు ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో దర్యాప్తు 20 నెలలు ఆలస్యమైందన్నారు. ఇందులో అరెస్టులు తప్పవని కూడా అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ దొరికినా.. భాజపా నేతలు మాట్లాడటం లేదని, బీఆర్ఎస్, భాజపా కలిసి ఉన్నారనేందుకు ఇదే నిదర్శనమని చెప్పారు. ఇకపోతే పదో తరగతి పరీక్షలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. 'ఇకపై పదో తరగతి పరీక్షలు లేనట్లే'నని చెప్పారు. ప్రస్తుతం.. దేశమంతా ప్లస్ 2 విధానం అమల్లో ఉందని ప్రస్తావించారు. తమది వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బడ్జెట్ అని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేస్, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో చట్టప్రకారమే ముందుకెళ్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తాము తొందరపడితే టెక్నికల్ రీజన్స్‌తో కోర్టు తిరస్కరించే ప్రమాదముందని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో న్యాయస్థానంలో ఊరట లభించలేదన్నారు. చక్రధర్ గౌడ్.. హరీశ్‌రావుపై పెట్టిన ఫోన్ ట్యాపింగ్, వేధింపుల కేసులో ఆయనకు రిలీఫ్ లభించిందని ప్రస్తావించారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో తనను విచారణకు రమ్మని నోటీసులిస్తే హాజరవుతానని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో విచారణ పూర్తి కాకుండా చర్యలు తీసుకోలేమని అన్నారు. కేసీఆర్ బయటకు రాకుండా గృహ నిర్బంధం చేశారని ఆరోపించారు. అల్లుడు, కుమారుడు కలిసి కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశారు. అందుకే ఆయన అసెంబ్లీకి రావడంలేదన్నారు. తెలంగాణ జాతిపిత ఎవరో ప్రజలు డిసైడ్ చేయాలన్నారు. ఏ గ్యారంటీ ఎప్పుడు అమలు చేయాలో తమ దగ్గర ప్రణాళిక ఉందని సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు. బిఆర్ఎస్ నేతలు చెబితే చేయాలని లేదన్నారు. అందుకే వారు అక్కడ ఉన్నారు..మేము ఇక్కడ ఉన్నామని అన్నారు. కేసీఆర్ హయాంలో అప్పులు, తప్పులు కప్పిపుచ్చి పాలన చేశారని ఎద్దేవా చేశారు. ఆ తప్పులు తాము చేయలేమన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.3.47లక్షల కోట్ల అప్పులు చేశామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పులను తీర్చేందుకే తామీ అప్పులు చేయాల్సి వచ్చిందని ప్రస్తావించారు. ఈ 26 నెలల్లో రూ.3.3 లక్షల కోట్లు కేసీఆర్ హయాంలో చేసిన అప్పుల్నే తమ ప్రభుత్వం తీర్చిందని చెప్పుకొచ్చారు. మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశాం. రూ.3.30

లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పులకు చెల్లించాం. మేం తెచ్చిన అప్పుల్లో కేవలం రూ.17వేల కోట్లు మాత్రమే వాడుకున్నాం. జాతీయ జీడీపీ కంటే తెలంగాణ జీఎస్‌డీపీ మెరుగ్గా ఉంది. జీఎస్టీ వసూళ్లు గడిచిన 2 నెలల్లో రూ.4 వేల కోట్లు దాటాయి' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# అకాల వర్షంతో అన్నదాతల కుదేలు



అమరావతి:అకాల వర్షాలకు పంట నష్టపోయిన ప్రతి రైతుకూ సాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. అకాల వర్షాల నేపథ్యంలో ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే 3-4 రోజులు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వడగళ్లతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతుల్ని అప్రమత్తం చేయాలని అచ్చెన్నాడు చెప్పారు. దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాలని అన్నారు. అధికారులు నష్టం వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలని సూచించారు. ఇకపోతే వరుసగా రెండో రోజూ అకాల వర్షాలు కురవడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని అన్నదాతలు కన్నీరుమున్నీరు అవుతున్నారు. గురువారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులతో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, ఒకటి, రెండుచోట్ల భారీవర్షాలు కురిశాయి. గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60 కి.మీ. వేగంతో గాలులు వీచాయి. అల్లూరి సీతారామ రాజు జిల్లా చింతపల్లి, జి.మాడుగులలో వడగళు పడ్డాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గురువారం కురిసిన మోస్తరు వర్షాలకు మొక్కజొన్న, మినుము, పెసర పంటలు మళ్లీ తడిచాయి. తడిచిన కారణంగా కాయలు రాలిపోతాయని, మినుము రంగుమారిపోతుందని, గింజలు రంగు మారిపోతాయని, రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ, పెనుగంచిప్రోలు, ఇబ్రహీంపట్నం మండలాల్లో మొక్కజొన్న పంట నేలవాలింది. లంక భూముల్లో కోత అనంతరం ఆరబెట్టిన మిర్చిపంట, ఉడకబెట్టి ఆరబోసిన పసుపు తడిచిపోయాయి. నెల్లూరు జిల్లాలో బుధ, గురువారాల్లో రాత్రిపూట కురిసిన వర్షాలకు కోతకు వచ్చిన వరి పైరు దెబ్బతినగా, మామిడి పూత, పిందెలు నేలరాలాయి. రాపూరు మండలం గోనుపల్లిలో వడగండ్ల వానకు దాదాపు 100 ఎకరాలకుపైగా వరి నేలవాలింది. రాంకూరు, గరిమెనపెంట గ్రామాల్లోని 100 ఎకరాల్లో మామిడి తోటల్లోని పూత, పిందె నేలరాలింది. నిమ్మ తోటల్లో పండ్లు రాలిపోయాయి. అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి, లింగంగుంట, మంగుపలి,?ల కామిరెడ్డిపాడు, అనంతసాగరం గ్రామాల్లో వరి దెబ్బతినగా, గుడిగుంట, గౌరవరం, గుడిగుంట గ్రామాల్లో మిరప, బొప్పాయి, పత్తి మెట్ట పైర్లు దెబ్బతిన్నాయి. కొండాపురం, జలదంకి మండలాల్లో వరి కోతలు పూర్తి చేసిన రైతులు గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం రాశులను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతపురం జిల్లాలో రైతులకు రూ.1.29 కోట్ల పంటనష్టం వాటిల్లినట్టు అంచనావేశారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం ఎర్రోనిపల్లిలో వడగండ్ల వానకు కర్బూజ పంట ధ్వంసమైంది. తిరుపతి జిల్లాలో 1070 ఎకరాల్లో అరటి, వరి, తమలపాకు పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు సుమారు రూ.10.25 కోట్ల మేరకు నష్టం వాటిల్లింది. బాపట్ల జిల్లాలో గురువారం జల్లులు కురవడంతో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చిని కాపాడుకోడానికి రైతులు శ్రమించాల్సి వచ్చింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు గ్రామాల్లో గురువారం వడగళ్లు పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పూత, పిందె దశలో ఉన్న మామిడి పంటకు నష్టం వాటిల్లింది. కాపు దశలో ఉన్న జీడిమామిడి సైతందెబ్బతిందని రైతులు చెబుతున్నారు. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులతో వర్షాలు పడతాయని, గంటకు 40 నుంచి 50, అప్పుడప్పుడు 60కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 23 వరకు కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రాష్ట్రంలో విస్తృతంగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. శనివారం కోస్తాలో శ్రీకాకుళం నుంచి ప్రకాశం జిల్లా వరకు అక్కడక్కడ పిడుగులతో పాటు

మోస్తరు వర్షాలు, రాష్ట్రంలోని మిగిలిన జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడతాయని పేర్కొంది.

## ఎల్పీజిని ప్రజలకు అందుబాటులో ఉంచాలి

అమరావతి: పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా దేశవ్యాప్తంగా వంట గ్యాస్ కొరత ఏర్పడిన నేపథ్యంలో హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చమురు శుద్ధి సంస్థలు ఎల్పీజీని అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు కాన్ఫిడెన్స్ పెట్రోలియం ఇండియా లిమిటెడ్‌కు ఆదేశాలు జారీ చేసింది. దేశంలో ఎల్పీజీ కొరత ఉన్న సమయంలో చమురు శుద్ధి సంస్థలు అంతర్జాతీయ మార్కెట్లో విక్రయాలకు పాల్పడితే.. అది సామాన్య ప్రజలకు తీరని నష్టంతో పాటు కష్టాలను కలిగిస్తుందని కోర్టు స్పష్టం చేసింది. వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరా చేసేందుకు వీలుగా గ్యాస్ను పంపిణీదారులకు మాత్రమే సరఫరా చేయాలని ఆదేశించింది. ఒబెనీ ఖీ।జీట: ÷నీటజా ఒబబిసన్గీ÷నీణా: శుక్రవారం దిన ఫలాలు.. ఈ రాశుల వారికి ధనయోగం పక్కా!దేశంలోని చమురు శుద్ధి కర్మాగారాలు ప్రొపేన్, బ్యూటేన్ నిల్వలను గరిష్టంగా ఎల్పీజీ ఉత్పత్తి కోసం ఉపయోగించడంతో పాటు ఉత్పత్తి చేసిన ఎల్పీజీని ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఓసీఎల్, హెచ్పీసీఎల్, బీపీసీఎల్లకు అందుబాటులో ఉంచి.. దానిని కేవలం దేశీయ వినియోగదారులకు మాత్రమే సరఫరా చేయాలంటూ ఈ నెల 5న జారీ చేసిన స్వీయ ఉత్తర్వుల కఠిన అమలుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## కుటుంబ ఆసతుల పంపకం జరగలేదు

విజయవాడ:కుటుంబ ఆస్తులపై దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి సతీమణి విజయలక్ష్మ కీలక వ్యాఖ్యలు చేశారు. 2009లో వైఎస్ఆర్ మరణం వరకున్న ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని స్పష్టం చేశారు. ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగలేదని ఆమె క్లారిటీ ఇచ్చారు. అన్ని ఆస్తులను నలుగురు మనుమళ్లకు సమానంగా పంచాలనేదే వైఎస్ఆర్ ఉద్దేశమని, ఇది ఆయన ఆదేశం కూడా అని స్పష్టం చేశారు. తమ దగ్గరి వాళ్లందరికీ తెలిసిన వాస్తవమిదని విజయలక్ష్మి అన్నారు. ఎంఓయూలో వైఎస్.షర్మిలకు రాసిన ప్రతీ ఆస్తి న్యాయంగా ఆమెకు చెందాల్సినవేనని తెలిపారు. అందుకే వైసీపీ అధినేత, తన కుమారుడు జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ఎంఓయూ రాశారని ప్రస్తావించారు. నిజానికి తనకు తక్కువే రాశారని, సరస్వతి సిమెంట్‌తో సహా ఎంఓయూలో లేని యెలహంక ల్యాండ్ కూడా షర్మిలదేనని చెప్పుకొచ్చారు. జగన్ ఇచ్చానని చెబుతున్న నగదు షర్మిల వాటాకు ఇచ్చిన డెవిడెండ్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఆస్తుల విషయంలో జగన్ తన మేనల్లుడికి, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశారని చెప్పుకొచ్చారు. ఎప్పటికైనా తనకు న్యాయం చేస్తారని జగన్ తల్లిగా ఆశిస్తున్నానని అన్నారు.

## జాబ్ ఫస్ట్ అనేది కూటమి లక్ష్యం

అమరావతి:ఏటా ఉగాది రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ నెరవేరుస్తామని అన్నారు.ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీచేసేందుకు ఈసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్లు ఆయన ప్రకటించారు. మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలు భర్తీచేస్తామని వివరించారు. ఉగాది పచ్చడి జీవితాలను ప్రతిబింబిస్తుందని, షడ్రుచుల తరహాలో జీవితంలోనూ కష్టసుఖాలు ఉంటాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 నాటికి తెలుగుజాతిని అగ్రస్థానంలో నిలిపేలా సంకల్పం తీసుకుని ముందడుగు వేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. యువతకు ఉద్యోగ కల్పనకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నాం. ఇప్పటివరకు 30,607 మందికి ప్రభుత్వోద్యోగాలు ఇచ్చాం. ప్రైవేటురంగంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం' అని సీఎం వివరించారు.జాబ్ ఫస్ట్ అనేది కూటమి ప్రభుత్వ విధానమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనికి ఉగాది కానుకగా విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌ను జత చేశారు. 'శ్రీపరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా వివిధ ప్రభుత్వశాఖల్లో 10,060 ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నాం. మే 15 నుంచి అక్టోబరు 15 వరకు వీటి నోటిఫికేషన్లు విడుదల చేస్తాం. ఉద్యోగార్థులు సన్నద్ధత, ప్రతిభతో అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరుతున్నాను' అని అందులో పేర్కొన్నారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కందుల దుర్గేష్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పంచాగశ్రవణం చేశారు. సంగీత, సాహిత్య, కళారంగాల్లో విశేషకృషి చేసిన 38 మందికి కళారత్న, 112 మందికి ఉగాది పురస్కారాలు సీఎం అందించారు. వ్యవసాయ, ఉద్యాన, తితిదే పంచాంగాలు, సాంస్కృతికశాఖ, శిల్పారామం వార్షిక కార్యక్రమాల క్యాలెండర్లను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. 'మన పండగలు, ఆచారాల్లోనే సైన్స్ ఉంది. వాస్తు, సూర్య నమస్కారాలు ఇలాంటివే. యోగా, నేచురోపతి కూడా ప్రకృతి నుంచి వచ్చినవే. విలువలతో జీవనం గడిపేవారికి ఉన్న ఆనందం మరెవరికీ ఉండదు. మనకంటే విదేశాల్లోని ప్రవాసాంధ్రులు మన సంస్కృతీ సంప్రదాయాలు పాటించి బ్రాండ్ అంబాసిడర్లుగా మారారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తికీ ఆర్థిక, సామాజిక, ఆరోగ్యభద్రత అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. దివ్యాంగ శక్తి, స్త్రీశక్తి పథకాలతో దివ్యాంగులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. సంపన్నులైన 10శాతం మంది సమాజంలో అట్టడుగున ఉన్న 20శాతం మందిని ఆదుకునేలా పీ4 కార్యక్రమాన్ని చేపట్టాం. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తిచేసి జాతికి అంకితమిస్తాం. దీనివల్ల కృష్ణా డెల్టాకు, విశాఖకు గ్రావిటీతో నీళ్లు వెళతాయి. తాగు, సాగునీటికి, పరిశ్రమలకు అవసరమైన నీటిని సరఫరా చేసేలా నీటి యాజమాన్య చర్యలు చేపడుతున్నాం. వేసవికి ముందే రాష్ట్రంలోని జలాశయాల్లో 65శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయి.

## సెట్టింగ్ పూజలు జగన్‌కు అలవాటు

అమరావతి: జగన్ ఆలయాలకు వెళ్లకుండా ఇంట్లోనే సెట్టింగ్‌లు వేసి పూజలు చేస్తున్నట్లు నటించడం అలవాటుగా మారిందని మంత్రి పార్థసారథి విమర్శించారు. అబ్దుల్ కలాం వంటి మహానుభావులు సంప్రదాయాలను గౌరవించి డిక్లరేషన్ ఇచ్చారని.. కానీ జగన్ ఎప్పుడూ ఆ పని చేయలేదన్నారు.ఈ మమేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొలుసు పార్థసారథి తీవ్ర విమర్శలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. 'హిందూ ధర్మాన్ని భక్షించే వారే 'హిందూ ధర్మ రక్ష' అని సాక్షి పత్రికలో ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదం' అని వ్యాఖ్యానించారు. పండుగల సమయంలో ప్రజలందరికీ మేలు జరగాలని కోరుకోకుండా.. కేవలం జగన్ బాగుండాలని మాత్రమే కోరుకోవడమే వైసీపీ నైజమని ఆరోపించారు. గత ఐదేళ్లలో హిందూ సంప్రదాయాలను గౌరవించిన దాఖలాలు లేవని, కల్తీ నెయ్యితో లడ్డూ తయారీ ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీశారని మంత్రి ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తు, యువత ఉపాధి విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. వైసీపీ హయాంలో గ్రాడ్యుయేట్ నిరుద్యోగం 24 శాతానికి చేరి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. గత 20 నెలల్లో 6,28,347 ఉద్యోగ అవకాశాలు కల్పించి దేశంలోనే ఏపీ రికార్డు సృష్టించిందని మంత్రి అన్నారు. ప్రతి ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. 2026 ఫిబ్రవరి 28 నుంచి దివ్యాంగులకు సిటీ బస్సులు, పల్లె వెలుగు బస్సుల్లో ఉచితం ప్రయాణం.. ఇతర బస్సుల్లో 50 శాతం రాయితీ అమలు చేస్తున్నామని తెలిపారు.

దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3,000 నుంచి రూ.6,000కు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రంజాన్ సందర్భంగా మౌజన్లకు రూ.45 కోట్లు తక్షణమే అకౌంట్లలో విడుదల చేశామని మంత్రి వెల్లడించారు. పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఇప్పటివరకు మూడు విడతలుగా 26,149 మందికి రూ.1,943 కోట్లు చెల్లించామని వివరించారు. ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ... అల్లా దయతో అందరి జీవితాల్లో సంతోషాలు వెల్లివిరియాలని మంత్రి పార్థసారథి ఆకాంక్షించారు.

## మరోమారు పెరిగిన బంగారం ధరలు

న్యూఢిల్లీ: మధ్య ప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో గురువారం భారీగా పతనమైన బంగారం ధర శుక్రవారం స్వల్పంగా కోలుకుంది. దేశంలో మేలిమి బంగారం ధర సగటున రూ.650ల మేర పెరిగింది. 10 గ్రాముల 22 క్యారెట్ బంగారం ధర రూ.600ల మేర పెరిగింది. వెండి ధర మాత్రం తిరోగమనంలో కొనసాగుతూ మరో రూ.5 వేల మేర తగ్గింది (ఉనీటె, ÷ూతిలెఽస ఖసతిఇ।బ నీని ఓజీసఇర 20). గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం, నేడు ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,50,930కు పెరిగింది. నిన్నటితో పోలిస్తే ధర రూ.650ల మేర ఎగబాకింది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర కూడా రూ.600ల మేర పెరిగి రూ.1,38,350కు చేరుకుంది. నగరంలో వెండి ధర మాత్రం దాదాపుగా నిన్నటి స్థాయిలోనే కొనసాగుతోంది. కిలో వెండి ప్రస్తుతం రూ.2,64,900గా ఉంది. ఇతర ప్రధాన నగరాల వారీగా చూస్తే చెన్నైలో ప్రస్తుతం 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.1,51,630గా ఉంది. ఢిల్లీలో రూ.1,51,080గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,50,930గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ బంగారం ధర రూ.1,38,990గా ఢిల్లీలో రూ.1,38,500 వద్ద కొనసాగుతోంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.1,38,350గా ఉంది. దేశంలోని పలు నగరాల్లో వెండి ధరలు తగ్గాయి. కిలో వెండి చెన్నైలో రూ.2,64,900గా ఉంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో కిలో వెండి రూ.2,55,000 వద్ద కొనసాగుతోంది. ఇకపోతే మధ్యప్రాచ్యంలో యుద్ధ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం అద్భుతమైన రికవరీని సాధించాయి. ఆరంభంలో ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ, ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతుతో ఒక దశలో సెన్సెక్స్ 900 పాయింట్లు, నిఫ్టీ 23,300 పాయింట్ల మార్కును దాటి దూసుకుపోయాయి. గత కొన్ని రోజులుగా పడుతున్న మార్కెట్లలో షేర్లు తక్కువ ధరకే లభిస్తుండటంతో దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఆఎఐబ), రిటైల్ ఇన్వెస్టర్లు భారీగా కొనుగోళ్లు చేపట్టారు. మరోవైపు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపుపై సానుకూల సంకేతాలు ఇవ్వడం ప్రపంచ మార్కెట్లకు బలాన్ని ఇచ్చింది. ఇది భారత మార్కెట్లలో కూడా ఉత్సాహాన్ని నింపింది. ఈ రోజు ట్రేడింగ్‌లో బ్యాంకింగ్, ఐటీ, ఆటోమొబైల్ రంగాలు అగ్రగామిగా నిలిచాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ వంటి బ్లూ-చిప్ షేర్లు మార్కెట్‌ను ముందుకు నడిపిస్తున్నాయి.

## బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు...ప్రగల్భాలు

హైదరాబాద్: అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదాయాన్ని పండబెట్టి.. అప్పుల కోసం అర్రులు చాచే బ్జడెట్ ఇది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బండి సంజయ్ కుమార్ స్పందిస్తూ తీవ్రంగా విమర్శించారు. 'మోసం.. దగా.. ప్రజా వంచన బ్జడెట్ ఇది' అంటూ వ్యాఖ్యలు చేశారు.మరో రూ.లక్ష కోట్ల అదనపు అప్పు భారం ప్రజలపై మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం సిగ్గు చేటని అన్నారు. రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించడంలో కాంగ్రెస్ హ్యాట్రిక్ కొట్టిందని అన్నారు. కేంద్రంపై ఆధారపడటం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకేమీ చేయలేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. రైతు భరోసా నిధులు రెండు విడతలు ఎగ్గొట్టినట్లేనా అని కేంద్రమంత్రి ప్రశ్నించారు. కౌలు రైతులు, వ్యవసాయ కూలీల నోట్లో మళ్లీ మట్టి కొట్టారని ఆరోపించారు. 'మహిళలను మళ్లీ వంచించారు... తులం బంగారం తుస్.. రూ.2,500లు నిల్' అని అన్నారు. అవ్వాతాతల నోట్లో మట్టి కొట్టారని.. రూ.4 వేల పెన్షన్ పెంపు గురించి ఊసే లేదని విమర్శించారు. నిరుద్యోగులను పట్టించుకోవడం లేదని.. బ్జడెట్‌లో నిరుద్యోగ భృతి అంశమే లేదని ఆయన అన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు అంటూ ప్రకటించినా ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని తెలిపారు. ఆరు గ్యారంటీలకు పాడె కట్టే బ్జడెట్ ఇదని మండిపడ్డారు.

ఆరోగ్యశ్రీకి కేటాయింపుల కంటే గత బకాయిలే ఎక్కువగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. విద్యకు 16 శాతం నిధులు కేటాయించాలని విద్యాశాఖ కమిషన్ ప్రతిపాదించినా 8 శాతానికే పరిమితం చేశారని బండి సంజయ్ విమర్శించారు. దేవాదాయ శాఖకు గత బ్జడెట్‌లో రూ.190 కోట్లు కేటాయించినా ఈసారి ప్రస్తావనే లేదని అన్నారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు కంటి తుడుపు కేటాయింపులు మాత్రమే ఇచ్చారని తెలిపారు. 56 శాతం బీసీ జనాభాకు కేవలం 4 శాతం మాత్రమే కేటాయింపులు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కూడా బ్జడెట్‌లో అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. మైనారిటీలకు గతేడాది కంటే ఎక్కువ నిధులు కేటాయించడం విడ్డూరమని వ్యాఖ్యానించారు. రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని ఆర్థిక మంత్రి చెప్పడం సిగ్గు చేటని విమర్శించారు. దావోస్, గ్లోబల్ సమ్మిట్ పేరుతో వచ్చిన పెట్టుబడుల వివరాలు వెల్లడించే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. రెండేళ్లలో దిగిపోయే ప్రభుత్వమే కదా అని.. ఇష్టారాజ్యంగా అప్పులు చేస్తున్నారని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ చేసిన అప్పుల భాగోతంపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

# 2027 జనాభా లెక్కలు దేశాభివృద్ధికి కీలకం..!

## - జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట,మార్చి 20,మన సాక్షి:**

2027 జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి, ప్రభుత్వ పథకాల సమర్థ అమలుకు కీలకమని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అధికారులు పూర్తి అవగాహనతో క్షేత్రస్థాయిలో బాధ్యతగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు.

జిల్లాలో జనాభా గణన-2027ను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి సెక్షన్ క్లార్క్ లు మరియు టెక్నికల్ అసిస్టెంట్లకు మార్చి 20, 22, 23 తేదీలలో మూడు రోజుల పాటు ఇళ్ల జాబితా, గృహ గణన శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జనాభా గణన నిర్వహణకు అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని తెలిపారు. మొదటి దశగా ఇళ్ల జాబితా (హౌస్ లిస్టింగ్) మరియు గృహ గణన మే 11 నుంచి జూన్ 9, 2026 వరకు, రెండో దశగా జనాభా గణన 2027 ఫిబ్రవరిలో నిర్వహిస్తారు. మార్చి 1, 2027ను రిఫరెన్స్ తేదీగా పరిగణిస్తారు.

అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, సీపీఓ కిషన్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. జనాభా గణాంక అధికారి రవీంద్ర నాయక్ మండలాల వారీగా గణన బ్లాకుల విభజన, గణన విధానం పై శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి వి. రామారావు, ఉప గణాంక అధికారి ఎం. రాజేష్, బి. కోటేశ్వరరావు, పర్యవేక్షకులు దున్న శ్యామ్, మండల ప్రణాళికా గణాంక అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిశద్ధలతో శ్రీరామాలయ భూమి పూజ

**గుర్రంపోడు,మార్చి 20,మన సాక్షి:**



నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల పరిధిలోని మోసంగి గ్రామంలో శ్రీ రామాలయ నిర్మాణానికి శుక్రవారం అత్యంత వైభవంగా శ్రీరామాలయ భూమి పూజ వైభవంగా జరిగింది. గ్రామస్తుల దశాబ్దాల కల సాకారమయ్యే దిశగా,వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖులు వెనపల్లి లక్ష్మణరావు తమ ఉదారతను చాటుకున్నారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన భూమితో పాటు, విరాళాన్ని ప్రకటించారు. లక్ష్మణరావు ఈ గొప్ప నిర్ణయంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన స్ఫూర్తితో గ్రామంలోని ఇతర ప్రజలు కూడా ఆలయ నిర్మాణానికి తమ వంతు విరాళాలను అందజేస్తూ ముందుకు వస్తున్నారు.గ్రామ సర్పంచ్ పిల్లి ఉమారాణి అభినయ్, ఆలయ చైర్మన్ నకరబోయిన సత్తయ్య ఈ పూజా కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షించారు. గ్రామస్తుల సహకారంతో ఈ పవిత్ర కార్యంలో భాగస్వాములయ్యారు. వేద పండితులు గిరి, సాయి అత్యంత భక్తిశ్రద్ధలతో , భూ మాతకు ప్రత్యేక అర్చనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మోసంగి గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జై శ్రీరామ్ నినాదాలతో గ్రామాన్ని మారుమోగించారు.

## ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

**గుర్రంపోడు, మార్చి 20,మన సాక్షి:**



నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం ఆమలూరు గ్రామంలో ఎడ్ల బండలాగుడు పోటీలు అత్యంత ఉత్సాహభరితంగా సాగాయి.స్థానిక శ్రీసీతా రామాంజనేయ దేవాలయం 71వ వార్షికోత్సవం, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ఈ గ్రామస్థాయి పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఆమలూరు సర్పంచ్ మేకల రమణ- సత్యనారాయణ, గుర్రంపోడు సర్పంచ్ జాల యాదయ్య, జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు.పోటీల ముగింపు అనంతరం విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం జరిగింది. ఈ పోటీల్లో బొమ్మ నరసింహకు చెందిన ఎడ్ల జత ప్రథమ బహుమతిగా 10,116 రూపాయలు గెలుచుకోగా, బొమ్మ మధు జత ద్వితీయ బహుమతిగా 7,500 రూపాయలను అందుకుంది. అలాగే మేకల నరసింహ జతకు తృతీయ బహుమతిగా 5,000 రూపాయలు, మేకల లింగయ్య జతకు చతుర్థ బహుమతిగా 3,000 రూపాయలను సర్పంచ్ మేకల రమణ సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. విజేతలను నగదు బహుమతులతో పాటు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొమ్ము బాలకృష్ణ, మాజీ సర్పంచ్ బొమ్ము జాల మల్లయ్య, ఆమలూరు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సబ్ స్టేషన్‌కు స్థల పరిశీలన



**గరిడేపల్లి, మార్చి 20,మన సాక్షి:**

గరిడేపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాయినిగూడెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్లు ఆయన తెలిపారు.సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వచ్చి, రైతులు,గృహ వినియోగదారులకు పెద్ద ఊరట లభించనుంది.ఆయన వెంట ఏఈ గన్న సాయి కృష్ణ,, పంచాయతీ సెక్రటరీ సునీత, ఏఎల్ఎం రాజు గ్రామపంచాయతీ గ్రామపంచాయతీ వైస్ ప్రెసిడెంట్ పిడమర్తి నాగరాజు మెంబర్స్ అమరారపు కరుణాకర్, అమరారపు బాబు,గుండు గురవయ్య, రాచమల్ల శ్రీకాంత్ పీటర్ పాలకవర్గ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు తేవాలి

**సూర్యాపేట,మార్చి 20,మన సాక్షి:**



విద్యుత్ బస్ ల వల్ల ఆర్టీసి రక్షణ, కార్మికుల ఉద్యోగులకు ఎసరు వస్తుందని, కేంద్ర ప్రభుత్వ విద్యుత్ బస్ విధానంలో మార్పులు కోసం ఐక్య పోరాటం జరగాల్సిన అవసరం వుందని, ఐక్య పోరాటాల ద్వారానే" ఆర్టీసీ రక్షణ -కార్మికుల హక్కుల హక్కుల పరిరక్షణ" సాధించుకోగలుగుతామని సిఐటియు జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక డిపో ఆవరణంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలు, విద్యుత్ బస్సులను ఆర్టీసీ కేటాయించాలని డిమాండ్ చేస్తూ బ్యానర్ పై సంతకాల సేకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యుత్ బస్ కొనుగోలు, నిర్వహణ, ఆపరేషన్, ఆర్టీసినే నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వ విద్యుత్ బస్ ల విధానంలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానంలో మార్పు జరగకుండా, ఆర్టీసీలు తమ మనుగడ సాగించడం కష్టమని ఉద్యోగులకు ముప్పు వస్తుందన్నారు.విద్యుత్ బస్ ల విధానంలో మార్పు కోసం ఆర్టీసిలోని అన్ని కార్మిక సంఘాలు సమైక్య ఆందోళనకు ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షా, కార్యదర్శులు దేగల రవి, ఉప్పు లక్ష్మయ్య, ఎస్ డబ్ల్యు ఎఫ్ నాయకులు రమేష్, నాగమల్లు, వెంకన్న, వీరయ్య, నందయ్య, రవీందర్,శ్రీను,చారి,అక్బర్, సరితప్రయాణికులు ,సమీరా, వెంకటమ్మ, రాంరెడ్డి, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సూరారపు పరీక్షన్ రాజ్



**సూర్యాపేట,మార్చి 20,మన సాక్షి:**

సూర్యాపేట కు చెందిన సూరారపు పరీక్షన్ రాజ్ ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి గా నియమించబడ్డారు.ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి అడ్వకేట్ ప్రియాంక కక్కర్ ఆదేశాల ప్రకారం ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమ సుదర్శన్ జిల్లోజు వర్కింగ్ కన్వీనర్ బుర్ర రాము గౌడ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అన్సారి చేతుల మీదుగా ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా పరీక్షన్ రాజ్ మాట్లాడుతూ నా పైన నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో ప్రజల సమస్యలపై అనునిత్యం పోరాడుతానని పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

## గంజాయి,డ్రగ్స్ నిర్మూలిద్దాం..!

**తిరుమలగిరి (సాగర్ ),మార్చి 20, మన సాక్షి:**




భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించే భగత్ సింగ్ స్మారక విద్యార్థి యువజన ఉత్సవాల సందర్భంగా తిరుమలగిరి మండల కేంద్రంలో గంజాయి డ్రగ్స్ నిర్మూలలపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ఎస్సై వీరశేఖర్ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమంలు ఎస్ఎఫ్ఐ - డివైఎఫ్ఐ నిర్వహించడం అభినందనీయమన్నారు.యువతను తప్పుదారి పట్టిస్తున్న గంజాయి వంటి మత్తు పదార్థాలు సమాజానికి పెద్ద ప్రమాదమని తెలిపారు.ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్ మాట్లాడుతూ విప్లవ వీరుడు భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటూ విద్యార్థి యువత ముందుకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీను ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు నల్లబెల్లి జగదీష్ నాయకులు డివిజన్ కమిటీ సభ్యులు గోపి ధనుష్ సందీప్ నవీన్ శివ గ్రేట్ వే ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## కాసర్లపహాడ్ పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం

**అర్వపల్లి,మార్చి 20,మన సాక్షి:**



మండల పరిధిలోని కాసర్ల పాడు ఎంపీపీ ఎస్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలన, కార్యక్రమం అద్భుతంగా నిర్వహించార ని మండల విద్యాశాఖ అధికారి బాలునాయక్ అన్నారు.విద్యార్థులు చదువుతో పాటు ఆటలు పాటలు నేర్చుకుంటున్నారని అదేవిధంగా భవిష్యత్తులో వారు ఏ విధంగా జీవిస్తారని వారి కోరికలను ఉపాధ్యాయులు తెలుసుకుని చిన్న ప్రయత్నం ఈ కార్యక్రమం అన్నారు,ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ నూర్జ బేగం, గ్రామ సర్పంచ్ మాంచాల లలితా రామ్మూర్తి యాదవ్, ఉప సర్పంచ్ బుసిపాక శ్రీనివాస్ గ్రామ ప్రముఖులు కూరాకుల యుగంధర్ కొంగర సంజీవ, అజారుద్దీన్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇరుకుల్ల వెంకటేశ్వర్లు, డబ్బేటి యాదగిరి, భూపతి శ్రీనివాస్ గౌడ్, కోన పుష్పలత, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీకంఠమహేశ్వర దేవాలయం ద్వితీయ వార్షికోత్సవం



**పెన్ పహాడ్,మార్చి 20,మన సాక్షి:**

మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామంలో శ్రీ కంఠమహేశ్వర స్వామి సూరమాంబ దేవి, గణపతి, కౌండిన్య మహర్షి, వనం మైసమ్మ, రేణుక ఎల్లమ్మ, పోతురాజుల, దేవాలయములు నిర్మించి, దేవతామూర్తుల విగ్రహాలు విగ్రహాలు ప్రతిష్టించి రెండు సంవత్సరములు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ద్వితీయ వార్షికోత్సవం వేద పండితులు ఇరువంటి వెంకటరమణ శర్మ, సత్యనారాయణ శర్మ, జే కిషోర్ శర్మ, గ్రామ పురోహితులు ఇరువంటి రామయ్య శర్మ, దేవతామూర్తుల ప్రతిష్టాపన ద్వితీయ వార్షికోత్సవం అర్చకులు వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించినారు.

కార్యక్రమంలో మాతృక పూజలు , సర్వతో భద్ర మండప ఆరాధనలు ,మూలమంత్ర మహా ఋషులు , అభిషేకాలు సాయంత్రం సంధ్య వేళలు దేవతామూర్తులకు అంగరంగ వైభవంగా మహిళలు మాల ధారణ స్వాములు జల బిందెలతో గ్రామ పురవీధులలో జల బిందెలతో భారీగా ఊరేగింపు జలాభిషేకం, విగ్నేశ్వర హోమం, నీరజ మంత్రపుష్పములు, తీర్థప్రసాదాలు వినియోగములు నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద గౌడ్ మేకపోతుల రామ్ దాస్, శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ మేకపోతుల జానయ్య, వైస్ చైర్మన్ అవిరేని ప్రవీణ్, వైస్ చైర్మన్ మేకపోతుల నవీన్, కోశాధికారి గూడెపురి సైదులు, కోశాధికారి మేకపోతుల సైదులు, ఈ కార్యక్రమంలో గ్రామములోని మాలాధారణ స్వాములు మహిళలు గ్రామ పెద్దలు ప్రజలు భారీగా పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు తోఫాలు, దుస్తుల పంపిణీ

**గరిడేపల్లి,మార్చి 20,మన సాక్షి:**



గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామంలో, రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు, సోదరీమణుల సంక్షేమం కోసం తోఫాలు, చీరలు,లాల్చీ -పైజామాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ముస్లిం సోదరులు, సోదరీమణులు ఈ కార్యక్రమంపై సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.మంత్రి మార్గదర్శకత్వంతో ఈ కార్యక్రమం విజయవంతమైందని చెప్పారు.ఈ కార్యక్రమంలో మత పెద్దలు, అధ్యక్షులు మస్తాన్ , ప్రధాన కార్యదర్శి ఖాసిం , వార్డు మెంబర్ సఫియా మీరా , సైదా ఉసేను, మదర్ సాబు, ముస్తఫా, నాగుల మీర, సైదా తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబానికి ఆర్థిక సహాయం




**నడిగూడెం,మర్చి 20,మన సాక్షి :**

రత్నవరం గ్రామస్తుడు అనంతు నరసయ్య అనారోగ్యంతో మరణించారు. శుక్రవారం వ్యవస్థాపకులు మిరియాల శ్రీనుమంగమ్మ వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించి మిరియాల రేణుక చేతుల మీదుగా వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా 2000 రూపాయలు,50 కేజీల బియ్యం కట్టను అందజేశారు.

## లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

**కేతేపల్లి,మార్చి 20,మన సాక్షి:**



కేతేపల్లి మండలం భీమారం గ్రామానికి చెందిన పసుపులేటి సైదులు కు చికిత్సకై రూ. 22,200 లు లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ వారు శుక్రవారం అందించారు. భీమారం గ్రామానికి చెందిన పసుపులేటి సైదులు ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. సైదులుకు బ్రెయిన్ లో క్లాట్ అవడంతో,ప్రస్తుతం ఖమ్మం హాస్పటల్లో ఐసీయు లో చికిత్స పొందుతున్నాడు. చికిత్సకు డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న విషయం నకరికల్ కు చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ వారు తెలుసుకొని భీమారం లోని అతని ఇంటికి వెళ్లి సైదులు తండ్రి వెంకటేశ్వర్లకు ఈ ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, కృష్ణ ప్రసాద్, చందన్, రమేష్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# ఆశాలకు రూ: 18 వేలు ఫిక్స్ వేతనం ఇవ్వాలి

**నల్లగొండ,మార్చి 20,మన సాక్షి:**



రాష్ట్రంలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆశా వర్కర్లకు ఫిక్స్ 18వేల వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి సలీం డిమాండ్ చేశారు.శుక్రవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంత్రుల కార్యాలయం ముట్టడిలో భాగంగా దొడ్డి కొమరయ్య భవన్ నుండి పెదగడియారం వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఇందిరా భవన్ ముట్టడి చేయగా పోలీసులు జోక్యం చేసుకొని ఆర్డిఓ అశోక్ రెడ్డిని పిలువగా వారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.

ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు 18 ఫిక్స్ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని అందుకు అనుగుణంగా బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మహేశ్వరి కార్యదర్శి తవిటి వెంకటమ్మ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య లేకపాక రాజు సహాయ కార్యదర్శులు పెంజర్ల సైదులు, జిల్లా కమిటీ సభ్యులు ఏదుళ్ళ సునీత ఆదిమల్ల సుధీర్ సిహెచ్ అనురాధ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సైదమ్మ రేణుక నవనీత కవిత శైలు తదితరులు పాల్గొన్నారు.

**అక్రమ అరెస్టులను ఖండించండి:** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంత్రుల కార్యాలయాల ముట్టడి భగ్నం చేయడానికి పోలీసులు ఉదయం తెల్లవారుజామున మహిళలని చూడకుండా అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య అన్నారు జిల్లాలో సుమారు 22 పోలీస్ స్టేషన్లో 400 మంది వరకు ముందస్తు అరెస్టులు చేశారని ఇది దుర్మార్గమైన చర్య అని అన్నారు. ప్రజా పాలన అని చెబుతున్న ఇది రాక్షస పాలనగా మారిందని అన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ లో అంకెల గారడి



**తుంగతుర్తి,మార్చి 20, మన సాక్షి:**

తుంగతుర్తి మండల పరిధిలోని బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు తాడికొండ సీతయ్య మాట్లాడుతూ ఈ రోజు శాసన సభలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ మరోసారి ప్రజలను మోసం చేసే విధంగా ఉన్నది. రెండున్నర సంవత్సరాలుగా పాలన చేస్తున్న ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడిగా మారింది. ఆశగా ఎదురు చూస్తున్న వృద్ధులకు. మహిళలకు. వికలాంగులకు. నిరుద్యోగ యువతకు నిరాశే ఎదురైంది..ఈ కార్యక్రమంలోజిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్ మండల నాయకులు తునికి సాయిలు. గోపగాని రమేష్. చింత కంట భాస్కర్ గోపగాని వెంకన్న పాల్గొన్నారు.

## రంజాన్ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**అర్వపల్లి,మార్చి 20,మన సాక్షి:**



ముస్లిం సోదరులు అత్యున్నత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే రంజాన్ పండుగను సంతోషంగా నిర్వహించుకోవాలని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు అర్వపల్లి ఎస్సై ఈట సైదులు తెలిపారు. గ్రామాలలో సోదరులు గా కలిసి జీవిస్తున్న ముస్లిం ,హిందువులు, వారి పండుగను కూడా కలిసి నిర్వహించుకోవాలని అన్నారు, సూర్యాపేట జిల్లా ఎస్పీ, డి.ఎస్.పి, నాగారం సిఐ నాగేశ్వరరావు ల ఆధ్వర్యంలో, మండల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మేకల రాములు, రవి, రమణ, గోపయ్య, సోమయ్య సుధీర్ యాదగిరి రెడ్డి శ్రీను మహేష్ రాజా రేణుక పాల్గొన్నారు

## ఉప్పల్ ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



**నాచారం,మార్చి 20,మన సాక్షి:**

హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువును ఖాళీ చేసి పనులు ప్రారంభం పట్ల ఇచ్చిన మాట ప్రకారం పనులు ప్రారంభించినందుకు ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో బారాస నాయకులు హెచ్ఎంటి నగర్ చెరువు కట్టపై ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అప్పటి వరకు పటేల్ కుంట చెరువులోని గుర్రం యొక్క తొలగించే పనులు తక్షణమే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బారసా నాయకులు సాయిజెన్ శేఖర్, మేడల మల్లికార్జున గౌడ్, విట్టల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, మారయ్య, మక్తల శేఖర్ గౌడ్, సంఘం యాదగిరి,చంద్రశేఖర్, సుగుణాకర్ రావు, జయరాజ్, వాసు, ఈశ్వర్, నరసింహ, రాజేష్ గౌడ్,వెంకటరెడ్డి, వీరాంజనేయులు, రోహిత్, జహీర్, కిరణ్ స్వామి, ఫారూఖ్, ముదసిర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు

## కొప్పోల్ దేవాలయ కమిటీ చైర్మన్‌గా రెండోసారి ఏకగ్రీవం

**గుర్రంపోడు, మార్చి 20,మన సాక్షి:**



నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం కొప్పోల్ గ్రామ దేవాలయ కమిటీ చైర్మన్‌గా అయితగోని పరమేష్ గౌడ్ వరుసగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామంలోని భక్తులు, పెద్దలు మరియు యువత సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.గత పదవీకాలంలో దేవాలయ అభివృద్ధికి పరమేష్ గౌడ్ చేసిన విశేష కృషిని గుర్తించిన గ్రామస్తులు, ఆయనపై ఉన్న నమ్మకంతో మరోసారి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, పరమేష్ గౌడ్ నాయకత్వంలో దేవాలయం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.తనపై నమ్మకం ఉంచి రెండోసారి అవకాశం కల్పించిన గ్రామ ప్రజలకు పరమేష్ గౌడ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయానికి వచ్చే భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమని, అందరి సహకారంతో ఆలయాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పెన్ పహాడ్ లో 1.7 కీలోల గంజాయి పట్టివేత..!

**పెన్ పహాడ్,మార్చ్ 20,మన సాక్షి:**




సూర్యాపేట జిల్లా పెన్ పహాడ్ మండలం అనంతారం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు గంజాయిని గురువారం పట్టుకున్నారు. పెన్ పహాడ్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, పెన్ పహాడ్ యస్ ఐ కస్తాల గోపికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.మండలంలోని అనంతారం క్రాస్ రోడ్డు వద్ద ఎస్ ఐ గోపికృష్ణ తన పోలీసు సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి ఒక ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు వ్యక్తులు పరారవుతుండగా పట్టుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని పోలీసులు తనిఖీ చేసి1 కేజీ 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పెన్ పహాడ్ మండలం మాచారం గ్రామానికి చెందిన బొమ్మ కంటి గోపి, పెన్ పహాడ్ మండల కేంద్రానికి చెందిన ఒగ్గు ఈశ్వర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామానికి చెందిన చింతల వెంకటేష్ కొన్ని రోజుల క్రితం ఒరిస్సా రాష్ట్రానికి వెళ్లి రెండు కిలోల గంజాయిని కొనుగోలు చేసి. దీనిలో 300 గ్రాములు వినియోగించారు. మిగిలిన1.7 కిలోల గంజాయిని సూర్యాపేటలో విక్రయించడానికి, అమ్మటానికి, పెన్ పహాడ్ నుంచి సూర్యాపేటకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అనంతారం క్రాస్ రోడ్డు వద్ద పోలీసులకుచిక్కినారు. నిందితుల నుంచి ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.విలేకరుల సమావేశంలో జోసెఫ్, మధుకర్, లింగరాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

## ఆర్మీ అగ్ని వీర్ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం



**నారాయణపేట టౌన్, మార్చి 20, మన సాక్షి :**

వారియర్స్ డిఫెన్స్ అకాడమీ, లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట వారి సౌజన్యంతో గత సుమారు 5 ఏళ్ల నుంచి ఆర్మీ, అగ్ని వీర్, పోలీస్ కానిస్టేబుల్ ఉచిత శిక్షణ తరగతులు, ఫిజికల్ ఫిట్నెస్ శిక్షణ అందిస్తూ వస్తున్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న ఎంతోమంది నిరుద్యోగ యువత రక్షణ రంగంలో పోలీసు ఉద్యోగాలు సాధించారు. ఈ ఏడాదికి గాను నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీ వేద సరస్వతి జూనియర్ కళాశాల లో వారియర్స్ డిఫెన్స్ అకాడమీ లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట వారి ఆధ్వర్యంలో ఉచిత క్లాసులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉచిత శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.వారియర్స్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు ఆర్మీ మాట్లాడుతూ శిక్షణా తరగతుల నిర్వహణ కోసం లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట అధ్యక్షురాలు లయన్ సరితా హరినారాయణ భట్టాడ్, లయన్ రవికుమార్ గౌడ్, శ్రీ వేద సరస్వతి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ శేషమ్మ సహకారం అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బాలు, చక్రి, రాము తదితరులు పాల్గొన్నారు.

## తడి-పొడి చెత్త వేరు చేయడం పై అవగాహన

**పెన్ పహాడ్,మార్చి 20,మన సాక్షి:**



మండల పరిధిలోని సింగారెడ్డి పాలెం గ్రామంలో సర్పంచ్ ఒగ్గు కిరణ్ కుమార్ అధ్యక్షతన తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం పై ప్రయోజనాల గూర్చి శుక్రవారం ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామములోని ప్రజలు చెత్త ట్రాక్టర్ వచ్చినప్పుడు తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలని ఆయన సూచించినారు. తడి చెత్తతో వర్మి కంపోస్ట్ ఎరువులు తయారు చేయుటకు ఉపయోగపడుతుందని వర్మి కంపోస్ట్ ఎరువు ద్వారా గ్రామంలో చెట్లకు నర్సరీలలోని మొక్కలకు వర్మికంపోస్టు వేయడం వలన ఏపుగ ఎదుగుతాయని ఆయన అన్నారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేయడం వలన పలు రకాల ప్రయోజనాలు ఉన్నాయని ఆయన ప్రజలకు తెలిపినారు . ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి షేక్ అఖిల్, మండల కాంగ్రెస్ నాయకులు ఒగ్గు వెంకన్న,పేరపంగ వెంకన్న, గ్రామపంచాయతీ సిబ్బంది మామిడి లచ్చయ్య, రాయి రాములమ్మ, షేక్ జాని సాబ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పాఠశాలకు పూర్వ విద్యార్థి విరాళం అభినందనీయం

**పెన్ పహాడ్,మార్చి 20,మన సాక్షి:**



మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాలకు దోసపహాడ్ పాఠశాలకు పూర్వ విద్యార్థి మల్లేపల్లి వెంకటేశ్వర్లు శుక్రవారం పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మామిడి వెంకన్నకు విరాళం అందజేసినారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి మల్లేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాఠశాల యందు ప్రహరీ గోడలపై తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటాన్ని వేయించుటకు మూడు వేల రూపాయలను చిన్నతనము లో విద్యను అభ్యసించిన పాఠశాలకు విరాళం అందజేయడం ఎంతో సంతోషకరంగా ఉన్నదని ఆయన అన్నారు. గ్రామంలో పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు తోడ్పడాలని ఆయన అన్నారు. మన ఊరు మన బడి పాఠశాల అభివృద్ధికి దాతలు భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమములో మాజీ విద్యా కమిటీ చైర్మన్ పెద్ద పంగ కరుణానిధి, గ్రామ కార్యదర్శి జానీ వర్మ, ఉపాధ్యాయులు కళ్యాణి విజయ కుమారి వై వెంకన్న విప్లవ కుమారు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ "తోఫా"కిట్ల పంపిణీ

**నకిరేకల్,మార్చి 20,మన సాక్షి:**



నకిరేకల్ పట్టణంలోని పన్నాల గూడెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు నియోజకవర్గ పరిధిలోని మైనార్టీ సోదరులకు ప్రభుత్వం తరఫున అందిస్తున్న రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వీరేశం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి వర్గం సంక్షేమానికి కట్టుబడి ఉందని పండుగలను ఆనందంగా జరుపుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రజిత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్త మంజుల, స్థానిక కౌన్సిలర్లు మైనార్టీ నాయకులు మతిన్ తదితరులు పాల్గొన్నారు.

## పండగపూట విషాదం..చెరువులో పడి వ్యక్తి మృతి

**తుంగతుర్తి, మార్చి 20, మన సాక్షి:**



తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని నూతనకల్ మండలం పెదనెమిల గ్రామంలో ఉగాది పండగ రోజున విషాదం నెలకొంది. పెదనముల గ్రామానికి చెందిన నాగెల్లి రామస్వామి (60)అనే వ్యక్తి పండుగ సందర్భంగా తన పశువులను ముత్యాలమ్మ కుంటలో కడుగుతుండగా, ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతయ్యాడు.తన చేతి కర్ర నీటిలోకి వెళ్లడంతో దానిని తీసే క్రమంలో లోతులోకి వెళ్లి మునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి రామస్వామి మృతదేహాన్ని బయటకి తీశారు.పండుగ వేళ ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## జెపి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ

**పటాన్చెరు, మార్చి 20,మన సాక్షి:**



పటాన్చెరు పట్టణ కేంద్రంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని, జెపి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరీమణులకు చీరలు పంపిణీ చేయబడింది. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు మాజీ జడ్పీటీసీ మరియు జేపి లయన్స్ క్లబ్ చైర్మన్ మాద్రి జైపాల్ ముదిరాజ్ తో పాటు ఎండిఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని చీరలను అందజేశారు.ఈ సందర్భంగా, పృథ్వీరాజ్ రంజాన్ మాసం త్యాగం, భక్తి, సహనం మరియు సేవకు ప్రతీక అని తెలిపారు. ముస్లిం సోదరులు, సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజెప్పుతూ, ఈ పవిత్ర మాసం ప్రతి కుటుంబానికి శాంతి, ఆనందం మరియు ఆరోగ్యం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్ గౌడ్, మతీన్, సాయి తేజ,రమేష్, అలీ,అంబరీష్ అలాగే లయన్స్ క్లబ్ మరియు ఎండిఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చదరంగం మెలకువలు నేర్పండి

**నారాయణపేట టౌన్, మార్చి 20, మన సాక్షి:**



నారాయణపేట జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గ్రౌండ్) లో పాలమూరు ఎన్ఆర్ఐ ఫోరం, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వ ర్యంలో జిల్లాలోని అన్ని పాఠ శాలల వ్యాయామ ఉపాధ్యా యులకు ఒకరోజు చదరంగం శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలోజిల్లా విద్యాశాఖ అధికారులు ఏఎంఓ విద్యాసాగర్, సిఎంఓ రాజేందర్ కుమార్, ఎస్ఓ నాగార్జున రెడ్డి, అంతర్జా తీయ చెస్ ట్రైనర్ ప్రవీణ్ కుమార్, జిల్లా చెస్ కోఆర్డి నేటర్ వీరుమల్లేష్ పాల్గొనీ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూచెస్ అనేది మేధస్సును పదును పెట్టే సాధనం అన్నారు. చెస్ విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆలోచ నా శక్తి, నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించే మానసిక క్రీడ అని ఏ ఎమ్ ఓ విద్యాసాగర్ తెలిపారు.

మొబైల్‌కు దూరం-పుస్తకాలకు దగ్గర :

చెస్ ఆడడం వల్ల విద్యార్థులు మొబైల్ వినియోగానికి దూరమై, పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకుంటారని రాజేంద్ర కుమార్ పేర్కొన్నారు. గణితంలో లాజికల్ థింకింగ్‌కు చెస్ తోడ్పాటు చెస్ ద్వారా లాజికల్ థింకింగ్ పెరిగి, గణితంలో మరియు చదువులో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని నాగార్జున రెడ్డి వివరించారు. ప్రతి పాఠశాలలో చెస్‌కు ఒకరోజు కేటాయించాలి అని అన్నారు. అంతర్జాతీయ చెస్ శిక్షణ నిపుణులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, చెస్‌లో ప్రతి కదలిక ముందస్తు ఆలోచనతో ఉండాలని, ఇది విద్యార్థుల్లో ఓర్పు, ప్రణాళికా దృష్టి, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంచుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పాలమూ రు ఎన్ఆర్ఐ ఫోరం సభ్యు లు బొల్లం కృష్ణ కిషోర్, అరు ణ్ కుమార్, మలేల మురళీ ధర్‌లకు కృతజ్ఞతలు తెలి పారు. చెస్ శిక్షకులు ప్రవీణ్ ను వ్యాయమ ఉపాధ్యా యులు శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ జిఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా టెక్ట్స్ బుక్ ఇంచార్జ్ సాయి నాథ్ మరీయూ జిల్లా కోఆర్డినేటర్ వీర మల్లేష్, వాలంటీర్ మహిపాల్‌తో పాటు జిల్లాలోని అన్ని పాఠ శాలల వ్యాయామ ఉపాధ్యా యులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్ల పథకం పేదలకు వరం

**వెల్దండ,మార్చి 20,మన సాక్షి:**



ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదలకు వరంలా ఉందని సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం గోరటి నాగమ్మకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి సర్పంచ్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదోడి సొంతింటి కల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బస్నమోని శ్రీను ముదిరాజ్, వార్డు సభ్యులు మసిగుండ్ల వెంకటేష్, గుద్దేటి కిష్టాల్, గోసుల కొండయ్య, రంగనాథం మల్లేశ్వరి, జంగిలి ఆనంద్, బాదేపల్లి రమేష్, రాఘవరెడ్డి, సిర్సనగండ్ల శేఖర్, పురుషోత్తం చారి , నాయకులు కొయ్యల పుల్లయ్య, శ్రీనివాస్, మట్ట భరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల పై అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**వెల్దండ,మార్చి 20,మన సాక్షి:**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) జీవి శ్యాంప్రసాద్ లాల్ శుక్రవారం మండల పరిధిలోని చొక్కన్నపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతు రామకృష్ణ సాగు చేస్తున్న మునగ తోటను పరిశీలించారు. తోట నిర్వహణ మొక్కల పెరుగుదల నీటి వినియోగ భృతి విచారణ పరిశీలించి రైతులకు మరింత సాంకేతిక మార్గదర్శకత అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం బొల్లంపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన ఆవుల షెడ్డు సందర్శించి, పశుసంవర్ధక కార్యకలాపాలకు ఉపయోగంగా ఇండియాలో నిర్వహణపై దృష్టి పెట్టాలని తెలిపారు. బొల్లంపల్లి గ్రామ సర్పంచ్ అధికారులను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ చిన్న ఓబులేసు, ఏపీ డి చంద్రశేఖర్, ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, ఏపీవో ఈశ్వర్ జి, ఏపీఎం జంగయ్య, సంతోష్, ఈసీ దేవేందర్, టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, సర్పంచులు సత్తూరి ప్రసాద్ గౌడ్, జక్కుల శిరీష వెంకటేష్, ఉప సర్పంచ్ రామకృష్ణ,ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుడు కొర్ర శివ నాయక్, ఐకెపి సీసీలు, క్షేత్ర సహాయకులు, కార్యదర్శి అన్నపూర్ణ, మరియు బొల్లంపల్లి గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గా మైదానం



**రామసముద్రం,మార్చి 19,మన సాక్షి:**

మండల కేంద్రం, చెంబకూరు ఈద్గా మైదానం రంజాన్ పండుగ సందర్భంగా మండలంలోని తిరుమలరెడ్డిపల్లె, చెంబకూరు, గొల్లపల్లె, కేసీ పల్లె, ఆర్ నడింపల్లె, ఊలపాడు ముస్లిం సోదరులు ప్రార్థనలు చేసేందుకు ఈద్గా ముస్తాబైంది, ముస్లిం సోదరులు ప్రార్థనచేసుకోవడానికి వచ్చే వారి కోసం షామియాన మంచి నీటి వసతి ఏర్పాట్లు చేశారు.

# సబ్ స్టేషన్ ఎదుట రైతులు ధర్నా



**కంగ్టి, మార్చి 20, మన సాక్షి :**

సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం తడ్కల్ ఫీడర్ పరిధిలో వ్యవసాయానికి సరైన సమయంలో విద్యుత్ అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక పంటలు ఎండిపోతున్నాయని మండిపడుతూ శుక్రవారం సబ్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. అధికారుల నిర్లక్ష్యంపై ఆపరేటర్పు నిలదీశారు. ఫోన్ చేసినా స్పందించడం లేదని, తక్షణమే విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించాలని రైతులు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమయానికి విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉన్నారు.

# ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



**నారాయణపేట టౌన్, మార్చి 20, మన సాక్షి:**

రంజాన్ పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జిల్లాలోని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బువ్వమ్మ గుట్ట ఈద్గా వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లను శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ రంజాన్ పండుగను పురస్కరించుకుని జిల్లా పరిధిలోని అన్ని ఈద్గాలు, మసీదుల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగ కుండా ముందస్తుగా ట్రాఫిక్ డైవర్షన్‌లు అమలు చేస్తు న్నామని, ప్రధాన రహదా రులు, చౌరస్తాల్లో ప్రత్యేక పోలీసు పికెట్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, పండుగ రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా నిరంతర పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నా మని తెలిపారు. సమాజంలో శాంతి భద్రతలను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పోలీస్ శాఖకు ప్రజలు పూర్తి సహ కారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఎస్పీ తో పాటు డీఎస్పీ నల్లపు లింగ య్య, ఎస్సై వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్,అధికారులు, ఎంఐఎం కౌన్సిలర్లు, ముస్లిం మత పెద్దలు తది తరులు పాల్గొన్నారు.

# మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

**వెల్దండ,మార్చి 20, మన సాక్షి:**



ఎండాకాలంలో వేసవి దాటికి నర్సరీలోని మొక్కలను రక్షించేందుకు సర్పంచ్ మహిపాల్ నాయక్ నెట్ సెట్స్ ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని పోచమ్మ గడ్డ గ్రామపంచాయతీ లో గల నర్సరీలో 3500 మొక్కలపై చలువ పందిళ్ళను (గ్రీన్ మ్యాట్స్) రక్షణ కొరకు వేయించామని తెలిపారు . ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వృక్షాలను మనం రక్షిస్తే అభిమానులను రక్షిస్తాయని, ప్రకృతిని కాపాడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు శ్రీరామ్ నాయక్, మున్నా నాయక్, రమేష్ నాయక్, దావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇస్మాయిల్పూర్ లో గ్రామ సభ

**బషీరాబాద్,మార్చి 20,మన సాక్షి:**



బషీరాబాద్ మండలం ఇస్మాల్పూర్ గ్రామ పంచాయతీలో శుక్రవారం సర్పంచ్ రూప్లా నామ్యా నాయక్ ఆధ్వర్యంలో "వికసిత భారత్ -- రోజ్గార్ ఆజీవికా హామీ మిషన్ (గ్రామీణ)" విబి -జి రామ్ జికు సంబంధించిన ఆడిట్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ ఆడిట్‌లో పథకం అమలు, పనుల పురోగతి, ఖర్చుల వివరాలు మరియు లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలపై సమగ్రంగా సమీక్ష చేయబడింది. సంబంధిత అధికారులు, సిబ్బంది మరియు గ్రామ ప్రజల సమక్షంలో ఈ కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా సర్పంచ్ రూప్లనామ్యా నాయక్ ఉపాధి పథకం సక్రమ అమలు కోసం అవసరమైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సంజీవ్ కుమార్, ఉపాధి హామీ సిబ్బంది టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపసర్పంచ్ బలరాం నాయక్, వార్డ్ మెంబర్స్, ఉపాధి హామీ సిబ్బంది గ్రామస్తులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా ఎంజిఎన్ ఆర్ఇజిఎస్ పనులు

**బషీరాబాద్ ,మార్చి 20,మన సాక్షి:**



బషీరాబాద్ మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాలు తండాలలో సిసి రోడ్, సైడ్ డ్రెన్స్, కాంపౌండ్ వాల్ గోడలు, డ్వాక్రా భవనాలు నిర్మాణ పనులు చేపడుతున్నారు. కాసింపూర్ రెడ్డి ఘనపూర్ ఇస్మాయిల్ పూర్ జలాల్పూర్ ఎక్మాయి కొర్విచెడ్ బషీరాబాద్ తదితర గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని ముఖ్యంగా మైల్వార్ పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి సుమారు ఐదున్నర లక్షల రూపాయలు పనులు ప్రారంభమయ్యాయి. మైల్వార్ గ్రామ అభివృద్ధికి తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి ద్వారా నిధులు తీసుకోవచ్చి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పాఠశాల కాంపౌండ్ వాల్ కు నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే కు ప్రత్యేక ధన్యవాదాలు అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుచ్చిరెడ్డి అన్నారు.

# జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసిన ఎస్పీ డాక్టర్ వినీత్

**నారాయణపేట టౌన్, మార్చి 20, మన సాక్షి:**



నారాయణపేట జిల్లాకు ఇటీవల నూతనంగా నియమితులైన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో పూల మొక్క అందించి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు జిల్లా పరిపాలన, శాంతి భద్ర తల పరిరక్షణ, ప్రజా సమస్య ల పరిష్కారం వంటి అంశాల పై పరస్పరం చర్చించుకున్నారు. జిల్లాలో చట్టవ్యవ స్థను మరింత బలోపేతం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పని చేసి జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం దిశగా పరిపాల న,పోలీస్ శాఖలు సమిష్టిగా కృషి చేస్తామని నూతన కలెక్టర్ నాయకత్వంలో జిల్లా మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు.

# నవోదయ విద్యార్థి ప్రతిభ చాటిన గిరిజన బిడ్డ

**కొడంగల్, మార్చి 20,మన సాక్షి:**



కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం పరిధిలో గల గోకాఫసాల్వద్ గ్రామంలో ఉన్నటువంటి ఆంగ్ల పాఠశాల పైనియర్ స్కూల్ కి చెందిన సభావాత్ గౌతమ్ నవోదయ విద్యాలయ 2026. ఫలితాల్లో అద్భుత ప్రతిభ చాటారు. ఎల్ జి తండా గ్రామానికి చెందిన సభావా త్ గౌతమ్ ఆరవ తరగతి ప్రదేశానికి ఎంపికయ్యారు .90/100 మార్కుల తో జిల్లా స్థాయిలో 33వ ర్యాంకు సాధించి గ్రామానికి , పాఠశాలకు గర్వకారణంగా పిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది గ్రామస్తులు గౌతమ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యే సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం..!

**బషీరాబాద్,మార్చి 20,మన సాక్షి:**



తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి సహకారంతో జలాల్ పూర్ గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని సర్పంచ్ జై వీర్ లాల్, ఉప సర్పంచ్ సతీష్ కుమార్ (మండల్ కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్)అన్నారు. బషీరాబాద్ మండలం జాలాల్ పూర్ గ్రామంలో డ్వాక్రా భవనం సిసి రోడ్డు పనులు ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్ మాట్లాడుతూ మా గ్రామానికి పదిలక్షల ద్వాక భవనం, సుమారు 6 లక్షల సిసి రోడ్డు పనులు మొదలు చేయడం జరిగింది ఇట్టి నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డికి, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరి సహకారం ఉంటే ఎమ్మెల్యే ద్వారా ఇక నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని అభివృద్ధి బాటలో ఉంచుతామని పేర్కొన్నారు. గ్రామానికి అవసరమైన సిసి రోడ్, సైడ్ డ్రెన్స్, మంచినీటి సమస్య, విద్యుత్తు ఎటువంటి సమస్య రాకుండా చూసుకుంటామని అన్నారు.

# చిన్నగూడూరు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తనిఖీ

**చిన్నగూడూరు,మార్చి 20,మన సాక్షి:**



చిన్న గూడూరు మండల కేంద్రంలోని మహబూబా బాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ , చిన్నగూడూరు పోలీస్ స్టేషన్‌ను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, కార్యాలయం లోపలి పరిస్థితులను సమగ్రంగా పరిశీలిం చారు. చిన్న గూడూరు మండల ఎస్సై ప్రవీణ్ కుమార్ మరియు సిబ్బందికి విధి నిర్వహణలో క్రమశిక్షణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం పై పలు సూచనలు చేశారు. ముఖ్యంగా అక్రమ కార్యకలాపాల పై ఎలాంటి జోక్యం ఉండకూడదని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లేదంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని,అలాగే స్థానిక సర్పంచ్ బాతెం రమేష్, పరస్పరం మాట్లాడి, గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరంపై చర్చించారు. గ్రామ భద్రతలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణలో సర్పంచ్‌లు పూర్తి బాధ్యత తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా హెల్మెట్ వాడకం పై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని, అవసరమైతే గ్రామాల్లో తమ స్థాయిలో ప్రచారం చేపట్టాలని సూచించారు,జిల్లాలో నేరాల నియంత్రణ,రోడ్డు భద్రత మరియు ప్రజల రక్షణ కోసం పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తుందని, ఎస్పీ డాక్టర్, శబరీష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వెంకటయ్య,రావి,సందీప్, స్థానిక సర్పంచ్ బాతెం రమేష్, పాల్గొన్నారు.

# ఆలూర్ లో దొంగతనం కలకలం..!

## తాళం వేసిన ఇంట్లో చోరీ

## 10 తులాల బంగారం,రూ:2 లక్షల నగదు అపహరణ



**ఆర్మూర్,మార్చి 20,మన సాక్షి:**

నిజామాబాద్ జిల్లా ఆలూర్ మండల కేంద్రంలో భారీ దొంగతనం చోటుచేసుకుంది. తాళం వేసి ఉన్న ఒక ఇంట్లోకి చొరబడిన దుండగులు,బీరువాలో ఉన్న 10 తులాల బంగారు ఆభరణాలతో పాటు రెండు లక్షల రూపాయల నగదును ఎత్తుకెళ్లారు. బాధితులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తలారి జమున (60),ఈ నెల 15వ తేదీ ఆదివారం సాయంత్రం తమ ఇంటికి తాళం వేసి, జుక్కల్‌లో ఉంటున్న చిన్న కుమారుడి వద్దకు వెళ్లారు.

శుక్రవారం ఉదయం పొరుగువారు గమనించగా, ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని చూసి ఆశ్చర్యపోయారు. వెంటనే జమున కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. తాము ఇంకా ఇంటికి రాలేదని బాధితులు చెప్పడంతో దొంగతనం జరిగినట్లు నిర్ధారణ అయింది. బాధితులు వెంటనే గ్రామానికి చేరుకుని లోపలికి వెళ్లి చూడగా.. ఇంట్లోని సామాగ్రి అంతా చిందరవందరగా పడి ఉంది. దొంగలు డికోల మంచాలను వెతికి బీరువాలను పగులగొట్టి,అందులో దాచిన 10 తులాల బంగారం మరియు రూ. 2 లక్షల నగదును అపహరించుకుపోయారు. పంతులాల బంగారంలో మూడు తులాల తీగ,నక్లెస్ రెండు తులాలు నర,2 తులాల నర పుస్తెలు తాడు, రెండు బంగారు గాజులు రెండు తులాలు, రెండు లక్షల రూపాయలు అపహరించుకుపోయారు.

బాధితుల వివరాల ప్రకారం ఆర్మూర్ సీఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నేషనల్ అవార్డు గ్రహీతకు సన్మానం



**ధర్మారం,మార్చి 19,మన సాక్షి:**

పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన తెలంగాణ వాణి పాత్రికేయుడు సుంచు మల్లేశం కు ఇటీవల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు రావడం పట్ల ధర్మారం మండల ఐజెయూ పాత్రికేయ విలేకరులు శుక్రవారం రోజున మహేశ్వర ఫంక్షన్ హాల్లో ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐజేయు జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం స్వామి రెడ్డి, ఐజేయు మండల పాత్రికేయులు కొత్తపల్లి శ్రీనివాస్, ఆశనవేణి రాజ్ కుమార్, గూడూరి లక్ష్మణ్, చిగిరి మల్లేశం, ఏదుల్ల ప్రభాకర్,మదన్మోహన్, ప్రవీణ్, తాళ్ల మధుకర్, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తాం..!

**ఆమనగల్లు, మార్చి 20,మన సాక్షి:**



ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయన్ పల్లి తండాలో శుక్రవారం నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు ప్రారంభించారు. ప్రభుత్వం ఇస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నూతన సంవత్సర ఉగాది సందర్భంగా కొత్త ఇంట్లో జీవితన్ని ప్రారంభిస్తున్నామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని కేశవులు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని తెలిపారు. నూతన లబ్ధిదారులు జటావత్ బుజ్జి దంపతులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగ్య నాయక్,శ్రీను నాయక్, హర్యానాయక్,గోపాల్, రాజు,తండావాసులు, పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీకి కేటాయించాలి



**దోమకొండ. మార్చి 20, మన సాక్షి:**

అంచనూరు గ్రామం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఐకెపి నుండి , సొసైటీ పరిధిలో మార్చాలని కోరుతూ జిల్లా డిప్యూటీ కలెక్టర్ విక్టర్ కు అంచనూర్ గ్రామ సర్పంచ్ జనగామ నరేష్ పాలకవర్గం సభ్యులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంచనూర్ గ్రామ సర్పంచ్ జనగామ నరేష్ మాట్లాడుతూ ....ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో సొసైటీకి కేటాయించాలని వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కందుకూరి ప్రభాకర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లింగ, నంది విగ్రప్రతిష్ట



**బషీరాబాద్,మార్చి 20,మన సాక్షి:**

పర్వతపల్లి గ్రామంలో లింగ నంది ప్రతిష్ట చేయడము జరిగింది. గ్రామ సర్పంచ్ పి పండురంగా రెడ్డి ఉప సర్పంచ్ కుర్వ రేణుక, కురువ పాండు గ్రామ పెద్దలు పి చంద్రశేఖర్ రెడ్డి,పి చంద్ర శేఖర్ రెడ్డి గ్రామస్తులు ముందుండి విగ్ర ప్రతిష్ట జరిపించడం జరిగింది.

## ఎల్లమ్మ దేవాలయం జాతర ఉత్సవాలకు విరాళం



**శివంపేట,మార్చి 20,మన సాక్షి:**

శివంపేట మండలంలోని లింగోజిగూడ గ్రామ సమీపంలో వెలసిన శ్రీ రేణుక ఎల్లమ్మ మంత్రాలయం దేవాలయంలో భాగంగా దేవాలయం కోసం 15000 రూపాయలు విరాళం లింగోజిగూడ మాజీ సర్పంచ్ మెగావత్ రవి నాయక్ చెప్పారు యతిన్ ట్రస్టు ఆధ్వర్యంలో అందజేసినట్లు చెప్పారు. లింగోజిగూడ గ్రామపంచాయతీ సభ్యులు గ్రామస్తులు పెద్దలు తదితరులు ఉన్నారు.

## రికార్డు స్థాయిలో ఉత్పత్తి



**గోదావరిఖని, మార్చి 20,మన సాక్షి:**

ఆర్.జి-1లోని జిడికె 11ఇంక్లైన్ భూగర్భ గనిలో ఒక్క రోజులో రికార్డు స్థాయి ఉత్పత్తి నమోదైంది మొత్తం ఉత్పత్తి లక్ష్యం 2916 టన్నులు కాగా, దాన్ని అదిగమించి 4025 టన్నుల ఉత్పత్తి చేసి 138% సాదించారు. ఇది 2025-26 ఆర్థిక సంవత్సరములో సంస్థ లోని అన్ని భూగర్భ గనులలో అత్యధిక రోజువారి ఉత్పత్తిగా నమోదైంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అర్జీ 1 జియం డీ లలిత్ కుమార్ జిడికె జిడికె 11 ఇంక్లైన్ గనిని సందర్శించి ఇట్టి విజయానికి కారణమైన అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు, సూపర్వైజర్లు, సహకరించిన యూనియన్ నాయకులను ప్రత్యేకంగా అభినందించి అందరికి స్వీట్స్ పంపిణీ చేసారు. ఈ సందర్బంగా జియం మాట్లాడుతూ భూగర్భ గనిలో యంత్రాలు సుమారు 20 గంటల పాటు నిరంతరం పని చేయడం వలన ఈ విజయానికి ప్రధాన కారణంగా నిలిచాయని ముఖ్యంగా కంటిన్యూస్ మైనర్ 2వ విభాగం 200% లక్ష్యాన్ని సాధించడం గొప్ప విశేషం అని తెలిపారు. ఈ విజయానికి కారణమైన ఆపరేటర్లు, టెక్నీషియన్స్, సూపర్ వైజర్లు, అధికారులు, కాంట్రాక్టర్లు మరియు గనిలోని అన్ని ఉద్యోగుల సమిష్టి కృషి కారణమని జియం కొనియాడారు. ఈ సందర్బంగా జిడికే 11 ఇంక్లైన్ గని మేనేజర్ కార్యాలయమును ప్రత్యేక పూజ కార్యక్రమం చేసి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, గని ఏజంట్ చిలుక శ్రీనివాస్, మేనేజర్ మల్లేశం, గ్రూఫ్ ఇంజనీర్ రాందాస్, డిప్యూటి పర్సనల్ మేనేజర్ వేణు, రక్షణ అధికారి మల్లేష్, ఫిట్ ఇంజనీర్ రాకేష్, ఎఐటియుసి నాయకులు రంగు శ్రీను, ఫిట్ సెక్రటరి, నాయిని శంకర్, ఫ్రీ షిఫ్ట్ ఇంచార్జ్ క్రాంతి, సూపర్వైజర్ వేణు, ఆపరేటర్స్ శ్రీనివాస్, అశిష్, అశోక్, ప్రసాద్ అధికారులు ఉద్యోగులు, సూపర్ వైజర్ స్టాఫ్ పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎన్నికల హామీలను అమలు పరచాలి

**ఆమనగల్లు, మార్చి 20,మన సాక్షి:**



ప్రజా సమస్యల పరిష్కారం కోసం నాగర్ కర్నూల్ జిల్లా డిమాండ్ బిజెపి నేత జాతీయ బి సి కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి నాయకత్వంలో బిజెపి ముఖ్య నాయకులతో కలిసి అదనపు కలెక్టర్ కి శుక్రవారం కలవడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎన్నికల హామీలను అమలు చేయాలని జిల్లాలోని ప్రజా సమస్యలను పరిష్కరించా లని కోరుతూ నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్ కి భారతీయ జనతా పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం వినతి పత్రం సమర్పించడం జరిగింది. ప్రధాన డిమాండ్లు ఇవే నెరవేరని హామీలు జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ భృతి వంటి ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేసి రైతులకు పెట్టుబడి సాయం అందక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రైతు భరోసా నిధులను విడుదల చేయాలి ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి పోతుగంటి భరత్ ప్రసాద్,బిజెపి జిల్లా అధ్యక్షులు నరేందర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు నాగేందర్ గౌడ్,గోరటి నరసింహ, లు,ఉన్నారు.

## నూతన విశ్రాంతి గదిని ప్రారంభించిన సీపీ గౌష్ ఆలం

**కరీంనగర్ మార్చి 20,మనఎసాక్షి**

:



పోలీస్ సిబ్బంది సంక్షేమం మరియు పనితీరును మెరుగుపరిచే లక్ష్యంతో, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన విశ్రాంతి గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి మానసిక ప్రశాంతత, శారీరక విశ్రాంతి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో రాజీ పడబోమని, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలను ఆధునీకరించి, సిబ్బందికి మెరుగైన పని వాతావరణాన్ని కల్పించడానికి విభాగం కట్టుబడి ఉందని సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, రూరల్ ఏసీపీ విజయకుమార్, ట్రాఫిక్ ఏసీపీ వెంకటస్వామి, రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తో పాటు ఎస్సై లు నరేష్ , లక్ష్మా రెడ్డి లతో పాటు ఇతర పోలీసు అధికారులు మరియు పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## చిత్తశుద్ధి ఉంటే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత చేయాలి

**నారాయణపేట టౌన్, మార్చి 20, మన సాక్షి:**



ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వా నికి చిత్త శుద్ధి ఉంటే చట్ట బద్ధత తీసుకురావాలనీ బిజెపి రాష్ట్ర ప్రధాన కార్య దర్శి వీరేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొండా సత్య యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. అంతకు ముందు మున్సిపల్ వివేకానంద పార్క్ నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్ కు చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. కానీ వాటిలో ఏ ఒక్క హామీ కూడా ఇప్పటివరకు పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు కే.రతంగ్ పాండురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు డాక్టర్ తిరుపతిరెడ్డి, లక్ష్మి శ్యామ్ సుందర్, బలరాంరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్, వైస్ చైర్మన్ మంజుల జి ఆర్ రెడ్డి, కౌన్సిలర్లు సత్య రఘుపాల్ రెడ్డి, ప్రభాకర్, రాఘవేంద్ర,సర్పంచ్ లు కే.నాగిరెడ్డి, చంద్ర శేఖర్ గౌడ్ ,పార్టీ సీనియర్ నాయకులు కర్నీ స్వామి, మిర్చి వెంకటయ్య,టౌన్ బిల్డర్ వెంకట రాములు, శ్యాంసుందర్ గౌడ్ , ఆశప్ప, రఘురామయ్య గౌడ్, గోపాల్ యాదవ్,డీలర్ అశోక్, సైదప్ప నక్క సత్యనారాయణ,దత్తు జాజాపూర్ మణి శంకర్ ,మండల బిజెపి అధ్యక్షురాలు జ్యోతి సాయి బన్న, పట్టణ కమిటీ,మండల వివిధ మోర్చాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రొటెస్టెంట్ క్రైస్తవులను ప్రభుత్వం గుర్తించాలి



**సికింద్రాబాద్,మార్చి 20, మన సాక్షి:**

తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోని సాల్మన్ రాజుకు రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ పదవి ఇవ్వాలని సికింద్రాబాద్ ప్రొటెస్టెంట్ చర్చ్ పాస్టర్లు మతపెద్దలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం తార్నాకలో ఏర్పాటు చేసిన విలుకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గోన సాల్మన్ రాజ్ ప్రొటెస్టెంట్ క్రిస్టియన్ గా క్రైస్తవులు హక్కుల కోసం గత 30 ఏళ్లుగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. క్రైస్తవులకు ఆపద వచ్చిన సమస్య వచ్చిన నేనున్నానంటూ ముందుకు వచ్చి సమస్య పరిష్కారం కోసం కృషి చేసే నాయకుడు సాలమన్ రాజ్ అని కొనియాడారు. సాల్మన్ రాజ్ చేసిన సేవలు కేవలం ముషీరాబాద్,సికింద్రాబాద్ నగరానికి సొంతం కాకుండా రాష్ట్రానికి ఉపయోగపడేలా ఉండాలన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం సాల్మన్ రాజ్ సేవలను గుర్తించి తగిన నామినేట్ పదవి ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ప్రొటెస్టెంట్ క్రైస్తవ నాయకులు వీ.జోసెఫ్,పాల్ జాకబ్, ప్రశాంత్, జీవన్, పీఏ మోజస్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురంలో అట్టహాసంగా జిల్లా స్థాయి ఎడ్ల పందాలు

**గుర్రంపోడు, మార్చి 19,మన సాక్షి:**



నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల పందాల పోటీలు అట్టహాసంగా ముగిశాయి. తెలంగాణ గిత్తల బల ప్రదర్శనలో భాగంగా నిర్వహించిన ఈ పోటీలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ పోటీలను వెంకటాపురం సర్పంచ్ మల్లోజు రామాచారి, ఉట్లపల్లి సర్పంచ్ భీమనపల్లి శ్రావణి శ్రీను బాబు, ప్రారంభించారు. భూపతి రాజు, మాజీ సర్పంచ్ బచ్చిన బోయిన శ్రీను పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ సంస్కృతిని, రైతు క్రీడలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఇలాంటి పోటీలు రైతుల్లో నూతనోత్సాహాన్ని నింపుతాయని పేర్కొన్నారు. జిల్లా నలుమూలల నుండి తరలివచ్చిన మేలు రకం గిత్తలు ఈ పోటీల్లో తమ ప్రతాపాన్ని చాటాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పందాల్లో విజేతలుగా ప్రథమ బహుమతి అనుముల గ్రామానికి చెందిన గిత్తలు కైవసం,ద్వితీయ బహుమతి వెంకటాపురం గ్రామానికి చెందిన గిత్తలు,తృతీయ బహుమతి: కాల్వపల్లి గ్రామానికి చెందిన గిత్తలు,నాల్గవ బహుమతి తిరిగి ఆతిథ్య గ్రామం వెంకటాపురం గిత్తలకే దక్కింది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# బర్మ సామి దేవాలయంలో భక్తులకు అన్నదానం

**శివంపేట,మార్చి 20,మన సాక్షి:**



శివంపేట మండలంలోని లింగోజిగూడ గ్రామ సమీపంలో వెలసిన శ్రీ బర్మా స్వామి దేవాలయంలో రథోత్సవాలు వైభవంగా నిర్వహించారు జాతర ఉత్సవాలు సందర్భంగా భార్యతో అన్నదాన కార్యక్రమము దేవాలయం చైర్మన్ పిల్లి శివకుమార్ ఆధ్వర్యంలో అన్నదానం భక్తులకు నిర్వహించారు. శ్రీ బర్మా స్వామి. రథోత్సవాలు సందర్భంగా దేవస్థానం కమిటీ చైర్మన్ పిల్లి శివకుమార్ ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలు పండ్లు పువ్వులు సమర్పించి తమ తమ మొక్కులను చెల్లించుకున్నారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేసిన వారిలో ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి. సర్పంచులు బుర్ర మురళీధర్ గౌడ్. మాలోత్ కిషన్ బి నర్సయ్య. మాజీ సర్పంచులు పెద్దపులి రవి. మెగావత్ రవి నాయక్. వివిధ పార్టీల నాయకులు ప్రముఖ సంఘ సేవకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా అధికార ప్రతినిధి బండారు గంగాధర్. కే యాద గౌడ్. మరి మహేందర్ రెడ్డి. పులిమామిడి నవీన్ కుమార్ గుప్తా. చుట్టుపక్కల గ్రామాల నుండి భారీ సంఖ్యలో భక్తులు మహిళలు హాజరై స్వామి వారి దర్శించుకుని పూజ చేసి స్వామివారి ఆశీస్సులు పొందారు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బర్మ సామి జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా బండారు గంగాధర్..!

**శివంపేట,మార్చి 20,మన సాక్షి:**



మెదక్ జిల్లా శివంపేట మండలంలోని పిలుట్ల గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బర్మ సామి దేవస్థానం మాజీ చైర్మన్ బండారు గంగాధర్ను మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధిగా మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నియామకం చేశారని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతరం కోసం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమా ప్రజలను చైతన్యవర్యం చేయడం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు అందరి సహకారంతో కాంగ్రెస్ పార్టీ బలోపేతరం కోసం కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్. జిల్లా గ్రంథాలయం చైర్మన్ సుహాసిన్ రెడ్డి. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్. జిల్లా మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు

## జర్నలిస్టుకు ఎమ్మెల్యే పరామర్శ



**తుర్కపల్లి, మార్చి 20,మన సాక్షి:**

తుర్కపల్లి మండల నవ తెలంగాణ రిపోర్టర్ ఆరే నర్సింలు రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ఆయనను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం తీసుకోవాలని అన్నారు .ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్రెడ్డి ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, సర్పంచ్ దొంకెనిక వెంకటేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు వంగ నారాయణరెడ్డి, వార్డు సభ్యులు కరుణాకర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు..

## విద్య, వైద్యంకు సరైన కేటాయింపులు లేవు..!

**గరిడేపల్లి,మార్చి 20,మన సాక్షి:**



గరిడేపల్లి మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు పత్రికా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన2026బి2027 సంవత్సరానికి కేటాయించిన 324,234 కోట్ల బడ్జెట్ లో ప్రాధాన్యత క్రమంలో కేటాయింపులు లేవన్నారు. ఉపాధి హామీకి బడ్జెట్ లో కేటాయింపులు తక్కువగా ఉన్నాయన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సరైన పద్ధతిలో కేటాయింపు లేదన్నారు. వ్యవసాయ కార్మికులకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు మొండి చేయి చూపిందన్నారు. పింఛన్ల పెంపు ప్రస్తావన లేదన్నారు. ఇంటర్ విద్యార్థులకు ఇస్తామన్న మోటార్ సైకిల్ మాట లేదన్నారు. ఇది పూర్తిగా అంకెల గారడి తప్ప రాష్ట్ర ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. ఈ బడ్జెట్ ముమ్మాటికి ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని విమర్శించారు.

## యువతకు అండగా కూటమి ప్రభుత్వం



**రామసముద్రం,మార్చి 20,మన సాక్షి:**

యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, కూటమి ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ యువతకు ఉగాది కానుకని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం రాజంపేట పార్టీ కార్యాలయంలో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, కేవలం 20 నెలల కాలంలోనే 6,28,347 ఉద్యోగాలను కల్పించి ప్రభుత్వం రికార్డు సృష్టించిందని, తాజాగా 10,060 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి క్యాలెండర్ విడుదల చేయడం శుభపరిణామమని కొనియాడారు. గత వైఎస్ జగన్ పాలనలో యువత తీవ్ర అన్యాయానికి గురైందని జగన్మోహన్ రాజు విమర్శించారు. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి నిరుద్యోగులను నమ్మించి వంచించారని, పరిశ్రమలను తరిమేసి 34 లక్షల మంది యువత భవిష్యత్తును నాశనం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్,టి ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు మేడికొండ రవికుమార్ నాయుడు, ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, మాజీ అధ్యక్షుడు టీ. సంజీవరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మందా శ్రీనివాసులు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రాంనగర్ నరసింహ, పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి ఎస్ కె.కరీం, క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు,సిద్ధిక్, ముని బాల తదితరులు పాల్గొన్నారు. జాబ్ క్యాలెండర్ కాపీలను ప్రదర్శిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## యువతకు ఉగాది కానుక..!

**కురబలకోట, మార్చి 20,మన సాక్షి:**



రాష్ట్ర యువతకు ఉగాది పర్వదినం సందర్భంగా 10 వేల ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల కావడం ఆనందదాయకమని రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ముదివేడు చెందిన షేక్ అయూబ్ బాషా పేర్కొన్నారు. ప్రెస్ మీట్‌లో ఆయన ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ నారా లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో యువగళం పాదయాత్రలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యలను సమగ్రంగా గుర్తించిన లోకేష్, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేయడం అభినందనీయమన్నారు. యువత గళాన్ని ఆలకించి, వారి ఆశయాలను నెరవేర్చే నాయకుడు నారా లోకేష్ మాత్రమేనని కొనియాడారు. ఉగాది సందర్భంగా నిరుద్యోగుల ఇళ్లలో వెలుగులు నింపిన ఈ నిర్ణయం పట్ల కూటమి ప్రభుత్వానికి, ముఖ్యంగా యువత సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న లోకేష్‌కు రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత తరఫున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు పూస మోహన్ రెడ్డి, తెలుగు యువత నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బడ్జెట్లో అంకెలు సంఖ్యలు తప్ప సంక్షేమ రంగాలను విస్మరించిన ప్రభుత్వం

**నల్లగొండ,మార్చి 20,మన సాక్షి:**



రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలు, సంఖ్యలలో కేటాయింపులు ఎక్కువ మొత్తంలో కనిపిస్తున్నాయి తప్పా ప్రజల జీవితాలలో ఎలాంటి మార్పు లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పేర్కొన్నారు. ప్రజల మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం వెనకడుగు వేస్తుందని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను వర్తింప చేయడంలో జాప్యం చేస్తుందని చెప్పారు. ముఖ్యంగా వ్యవసాయ రంగానికి కేటాయింపులు ఎక్కువ మొత్తంలో కనిపించిన అవి ఆచరణలో మాత్రం ఖర్చు కావడం లేదన్నారు. నల్లగొండ జిల్లాలో నిర్మాణంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి తగినన్ని నిధులను కేటాయించలేదన్నారు. నక్కల గండి డిండి ఎత్తిపోతల పథకమునకు బడ్జెట్లో ఈ రకంగా నిధులు కేటాయిస్తే పూర్తి కావడానికి ఎన్ని సంవత్సరాలు పడుతుందన్నారు. శ్రీశైలం సొరంగ మార్గం పూర్తి కావడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. సాగర్ ఎడమ కాలువ మరియు ఎమ్మార్పీ సైడ్ కాలువల మరమ్మతులు చేయడానికి నిధులు కేటాయించాలన్నారు. జిల్లాలో పెండింగ్ లో ఉన్న చిన్న నీటి వనరుల ప్రస్తావన లేదన్నారు. గ్రామీణ అభివృద్ధి పంచాయతీ రాజ్ శాఖకు నిధులు కేటాయించినప్పటికీ అంతర్గత రోడ్ల నిర్మాణానికి తగిన నిధులను విడుదల చేయడం లేదన్నారు.

## గంగమ్మ గుడికి పోతుల రాజు విగ్రహం బహుకరణ

**మదనపల్లి, మార్చి 20, మన సాక్షి :**



మదనపల్లి రూరల్ మండలం కోళ్ల బైలు గ్రామానికి చెందిన మాదిగ గుంతకనం అమ్మవారి భక్తుడు లాయర్ జి.ఎం. రెడ్డి తెట్టు పాలేటి గంగమ్మ గుడికి పోతుల రాజు విగ్రహాన్ని అందజేశారు. అవ్వ తాతల జ్ఞాపకార్థం గుడికి చెక్కతో అద్భుతంగా చెక్కిన పోతుల రాజు విగ్రహాన్ని భక్తిపూర్వకంగా బహుకరించారు. సాంప్రదాయ శైలిలో నైపుణ్యంతో రూపొందించిన ఈ విగ్రహం ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గ్రామస్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అంజి మాట్లాడుతూ, భక్తుడి ఈ సేవ అత్యంత శ్రేష్ఠమైనదని కొనియాడారు. పూర్వీకుల జ్ఞాపకార్థం చేసిన ఈ దానం వారి కుటుంబానికి అమ్మవారి కృపకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండేలా చేస్తుందని ఆశీర్వదించారు. గ్రామ పెద్దలు, భక్తులు జి.ఎం. రెడ్డి కుటుంబాన్ని అభినందిస్తూ, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు.

## మిట్స్ అశ్వ ఫెస్ట్ పోటీలకు అవకాశం

**మదనపల్లి, మార్చి 20,మన సాక్షి :**



మదనపల్లె సమీపంలో అంగళ్లు లోని మిట్స్ డీమ్డ్ టుబి యూనివర్సిటీ నందు అశ్వ 2026 – జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ లో భాగంగా నిర్వహిస్తున్న ఎక్స్టర్నల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో సోమవారం ప్రారంభం అవుతాయని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. ఇందులో క్రికెట్, కబ్బాడి, వాలీ బాల్ ఇతర ఆటల పోటీలకు నమోదు చేయని అభ్యర్థులు నేరుగా సోమవారం యూనివర్సిటీ నందు రిజిస్టర్ చేసుకోవచ్చని అన్నారు. ఇందులో జాతీయ స్థాయిలో డిప్లొమా, ఇంజనీరింగ్, డిగ్రీ,పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని, వివరాలు కళాశాల అశ్వ వెబ్ సైట్ ఒఒఒ.ఖంష్ట్రజ2ఎ.అఅ లేదా ఒఒఒ.ఎఠం.ఖఎ.అఅ లో పొందుపరిచామని ఆయన అన్నారు. ఈ వెబ్ సైట్ నందు రిజిస్ట్రేషన్ వివరాలు మరియు పోటీలకు సంబంధించిన వివరాలు ఉన్నాయని తెలిపారు. ఇతర సందేహాల కోసం 91 9100601116 కు సంప్రదించవచ్చని తెలిపారు.

## ప్రభుత్వ పథకాలు రైతన్నకు భరోసా

**రామసముద్రం,మార్చి 20, మన సాక్షి:**



అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం రాజంపేట మండలం బ్రాహ్మణపల్లె గ్రామంలో పర్యటిస్తూ, అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా డోర్ టు డోర్ క్యాంపెయిన్ చమర్తి జగన్ మోహన్ రాజు నిర్వహించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ రైతుల సంక్షేమం మరియు అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అంతే కాకుండా అన్నదాత సుఖీభవ పిఎం కిసాన్ ద్వారా రైతులకు నేరుగా ఆర్థిక సహాయం అందించి వారి వ్యవసాయ ఖర్చులకు తోడ్పాటు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎంసీ చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మేడి కొండు రవి కుమార్ నాయుడు,పి ఏ సి ఎస్ చైర్మన్ ముల్లగూరి సుబ్రహ్మణ్యం నాయుడు,మాజీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లు నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొమ్మి సాంబశివయ్య, మాజీ సర్పంచ్ ముత్తినేని వెంకటేశ్వర్లు, కొల్లా వెంకటసుబ్బయ్య, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**తుంగతుర్తి, మార్చి 20, మన సాక్షి:**



తుంగతుర్తి మండల పరిధిలోని వెలుగు పల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షులు అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబానికి గ్రామంలోని ట్రాక్టర్ యూనియన్ సభ్యులంతా మాతో అనునిత్యం కలిసిమెలిసి ఉంటూ హఠాత్తుగా మరణించిన మా యూనియన్ అధ్యక్షుని కుటుంబానికి మేము సైతం అంటూ గ్రామంలోని 60 మంది సభ్యులు తల కొంచెం సహాయాన్ని అందించి 80 వేల రూపాయలు మా సంఘ సభ్యులకు వారి కుటుంబానికి అందజేయడం జరిగిందన్నారు. మా గ్రామంలోని ట్రాక్టర్ యూనియన్ ఉపాధ్యక్షుడు వంగాల మనసూరు ప్రధాన కార్యదర్శి స్వర్గం శ్రీను కోశాధికారి గుడిపాటి శ్రీహరి యూనియన్ సభ్యులు మల్లెపాక ముత్తయ్య గుండా శ్రీను మోదాల సైదులు దయ్యాల వెంకన్న సతీష్ ఎల్లమ్మ శ్రీను పాల బిందెల ఏక స్వామి పలువురు ట్రాక్టర్ ఓనర్లు డ్రైవర్లు కలిసి అతని కుటుంబానికి ఆర్థిక సాయం అందించి వారి కుటుంబాన్ని ఆదుకుంటామని అభయమిచ్చారు.

# వైద్యుల సమస్యలపై ఎమ్మెల్యే వినతి

**తుర్కపల్లి, మార్చి 20,మన సాక్షి:**



గ్రామీణ వైద్యుల సమస్యలను పరిష్కరించాలని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి చిన్న కిష్టయ్య అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 24 గంటలు అందుబాటులో ఉండి వైద్యం అందిస్తున్న గ్రామీణ వైద్యులపై ప్రభుత్వం దాడులు నిర్వహిస్తున్నారని అట్టి దాడులను ఖండించాలని తెలంగాణ అసెంబ్లీలో ఆర్ఎంపీ సమస్యలపై వివరించాలని ప్రభుత్వ విప్ ను కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల లక్ష్మయ్య గౌడ్, తుర్కపల్లి మండల అధ్యక్షుడు పెండెం రవి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శంకర్, ఈసీ మెంబర్ రాజకుమార్ ,గుండాల మండల అధ్యక్షుడు వెంకన్న, ఆలేరు మండల అధ్యక్షుడు శ్రీనివాస్, వలిగొండ మండల అధ్యక్షుడు సుధాకర్ ,తుర్కపల్లి మండల ఉపాధ్యక్షుడు బాలయ్య,, గ్రామీణ వైద్యులు పెంటయ్య,బొడ్డు కృష్ణ, శివయ్య, కృష్ణ, నాగేష్, తదితరులు పాల్గొన్నారు..

## రంజాన్ ఇఫ్తార్ విందు



**బషీరాబాద్,మార్చి 20,మన సాక్షి:**

మాజీ ఎమ్మెల్యే నారాయణరావు మరి సర్పంచ్ వెంకటేష్ మహారాజ్ ఉపసర్పంచ్ అబ్దుల్ రజాక్, పెద్దలు రోహిత్ మహారాజ్ పాల్గొనడం జరిగింది.నరేష్ మాజి ఎంపీటీసీ, పవన్ ఠాకూర్, ఖలీద్,జహీర్, మునీర్,రాజు కుల్కర్ని,సిద్దు, ముక్తార్,రవి ప్రసాద్ మరియు గ్రామస్తులు పాల్కొండము జరిగింది

## ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా కిట్ల పంపిణీ




**వెల్దండ,మార్చి 20,మన సాక్షి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో పేద ముస్లింలకు అందిస్తున్న రంజాన్ కిట్లను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాలతో శుక్రవారం వెల్దండ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. రంజాన్ పండుగను ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బస్నమోని శ్రీను ముదిరాజ్, వార్డు సభ్యులు ముదిగొండ కవిత రమేష్, కిష్టాల్, మారేపల్లి మంజుల శ్రీను, శేఖర్, మసిగుండ్ల వెంకటేష్, మల్లేశ్వరి రంగనాథం, నాయకులు కొయ్యల పుల్లయ్య, ఈదులపల్లి శ్రీనివాసులు, తుంగ శ్రీను, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మట్ట భరత్ గౌడ్, నాయకులు హమీద్, ఎండి రషీద్, ఖలీమ్, మన్సూర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ బడ్జెట్లో బీసీలకు మరోసారి అన్యాయం..!

**మిర్యాలగూడ, మార్చి 20, మన సాక్షి:**

బడ్జెట్‌లో అంకెలు బాగున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో బీసీలకు జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు అందడం లేదని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులు గౌడ్ విమర్శించారు.ఆధిపత్య కులాల పార్టీల్లో బీసీ నాయకులు ఈ అంకెల వెనుక ఉన్న అసమానతలను ప్రశ్నించలేకపోవడం దారుణం అన్నారు.వెనుకబడిన తరగతులకు కేటాయింపులు 12,511 కోట్లు అయినా 3.85 శాతం మాత్రమే అని బీసీలు గమనించాలన్నారు. బడ్జెట్ కేటాయింపుల పెరుగుదలకు గొంతెత్తవలసిన అవసరం ఉంది. గత బడ్జెట్‌లతో పోలిస్తే ఈసారి బీసీ సంక్షేమానికి నిధులు పెంచినట్లు ప్రభుత్వం పేర్కొంది. అయినప్పటి జనాభా దామాషా ప్రకారం బీసీలకు రావలసిన వాటా దక్కలేదన్నారు బడ్జెట్లో బీసీలకు మరోసారి మొండి చేయి చూపించారు.బీసీ సబ్ ప్లాన్ ఊసే లేదు బీసీలకు యాడాదికి 20వేల కోట్లు లేనే లేవు ఇది ముమ్మాటికి బీసీ వ్యతిరేక బడ్జెట్ అని సైదులు గౌడ్ అన్నారు కాంగ్రెస్ పార్టీలో ఉన్న బీసీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఎమ్మెల్సీలు అడగాలి కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్టుగా బీసీ సబ్ ప్లాన్,సంవత్సరానికి 20 వేల కోట్లు ఎక్కడ పెట్టారో రేవంత్ రెడ్డి చెప్పాలనీ డిమాండ్ చేశారు.

## ఆస్తి పన్ను చెల్లించని బకాయిదారుల పై చర్యలు

**గోదావరిఖని,మార్చి 20,మన సాక్షి:**

ఆస్తి పన్ను చెల్లించని బడా బకాయదారులపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) ,రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బడా బకాయదారుల జాబితా తయారు చేసి తదుపరి చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్ కి సమర్పించినట్లు ఆమె తెలిపారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం సదరు ఆస్తులను జప్తు చేసి వేలం వేయడం జరు గుతుందని ఆమె తెలిపారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయంతో బకాయలు పూడ్చుకోవడం జరుగుతుందని అన్నారు. చివరి హెచ్చరికగా రెడ్ నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించని వారి పై ఈ కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.కాగా శని , ఆది వారాలు సెలవు దినాలైనప్పటికీ రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌంటర్లు యధాతధంగా పని చేస్తాయని ఆమె తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బకాయదారులు ఇంటి పన్ను , నల్లా బిల్లు , ట్రేడ్ లైసెన్స్ బకాయలు వెంటనే చెల్లించి నగర పాలక సంస్థకు సహకరించాలని ఆమె కోరారు.

## ముస్లింలకు ఇఫ్తార్ విందు



**తుర్కపల్లి, మార్చి 20,మన సాక్షి :**

తుర్కపల్లి మండల కేంద్రంలోని మజీద్ ఏ మునీర్ లో శుక్రవారం ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని మహమ్మద్ జహంగీర్ ,మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ గౌస్ ల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు.మసీదులో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ధనావత్ శంకర్ నాయక్, సర్పంచులు సోమల్ల వెంకటేశం, రఘు, జేరిపోతుల కరుణాకర్ , భూక్య రాజారాం నాయక్, ఉపసర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, నాయకులు కోట జాంగిర్, మహిపాల్,రాజు గౌడ్, అమరేందర్, మజీద్ సదర్, జహంగీర్ ,అమీనా సదర్ ఖదీర్, వార్డు సభ్యుడు, నజీర్, మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు..

## వెల్దండ నాయకులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి పదవులు

**వెల్దండ,మార్చి 20,మన సాక్షి :**



తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ వెల్దండ మండల నాయకులకు ఉన్నత పదవులు కట్టబెడుతూ.. మండలంలోని నాయకులకు పెద్దపీట వేసింది. మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు, వెల్దండ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డిని నాగర్ కర్నూల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా, డిసిసి జిల్లా కార్యదర్శిగా మండలంలోని కళ్యాణవాగు తండాకు చెందిన బానావత్ శంకర్ నాయకులను నియమించినట్లు శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో ఉన్నత పదవులలో నియమించినందుకు, నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి జిల్లా స్థాయిలో మరింత కృషి చేస్తామని, బాధ్యతలు అప్పగించిన డిసిసి అధ్యక్షుడు వంశీకృష్ణకు, కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

**సూర్యాపేట,మార్చి 20,మన సాక్షి:**



స్టాఫ్ నర్స్ ఉద్యోగాలిప్పిస్తామని నమ్మించి కోట్లాది రూపాయలు వసూలు చేసిన కిలాడీ కేటుగాడు దుగ్యాల రఘురామ్‌ను అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట పట్టణ సీఐ వెంకట్ తెలిపారు.... సీఐ వివరాలిలా హైదరాబాద్‌కు చెందిన వాణితో కలిసి సుమారు 60 మంది బాధితుల నుండి రూ.1.85 కోట్లు కాజేసినట్లు సీఐ వెల్లడించారు. ఈ మేరకు నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. మోసం చేసిన సొమ్ముతో జల్సాలు చేస్తూ ప్లాట్లు, కార్లు కొనుగోలు చేసినట్లు గుర్తించామని సీఐ తెలిపారు.

## మోటర్ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి చెందిన పాత టైర్లు,బ్యాటరీలు, ఇనుప విడి భాగాల వేలం

**నల్లగొండ, మార్చి 20,మన సాక్షి:**



జిల్లా పోలీస్ కార్యాలయంలోని మోటర్ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి చెందిన, ఉపయోగించకుండా కాలం చెల్లిన పోలీస్ వాహనాల పాత టైర్లు, బ్యాటరీలు, ఆయిల్ డ్రమ్స్,ఇతర ఇనుప విడి భాగాలపై వేలం నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ వేలం కార్యక్రమం ఈ నెల 25న ఉదయం 10.00 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించబడుతుందని తెలిపారు. వేలంలో పోలీస్ వాహనాలకు సంబంధించిన వివిధ రకాల పాత టైర్లు, ఆయిల్, పాత బ్యాటరీలు,స్పేర్ పార్ట్స్ తదితర వస్తువులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు పేర్కొన్న తేదీన ఉదయం 10.00 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయానికి హాజరై వేలంలో పాల్గొనువచ్చని అన్నారు.పూర్తి వివరాల కోసం మోటర్ ట్రాన్స్‌పోర్ట్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సూరపు నాయుడుని చరవాణికి 8712670170 సంప్రదించవచ్చని సూచించారు.

## లివర్ కాన్సర్ తో పోరాడుతున్న యువకుడు..!

### దాతల సహాయం కోసం ఎదురుచూపు



**మాడుగులపల్లి, మార్చి 20, మన సాక్షి:**

నల్గొండ జిల్లా మాడుగులపల్లి (మం) గ్రామానికి చెందిన గుండ్లపల్లి సంతోష్ రెడ్డి(32) గత ఆరు నెలల కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. తన తల్లి, తండ్రి కూడా రోజువారీ జీవితంలో కూలీపనులు చేసుకుంటూ రోజు గడుపుకుంటున్నారు. అయితే ఈ నిరుపేద కుటుంబంలో సంతోష్ రెడ్డికి పెద్ద వ్యాధి రావడంతో బంధు మిత్రుల వద్ద దాదాపు 6 లక్షల రూపాయలు వరకు అప్పు చేసి ఆసుపత్రిలో చూయించుకున్నాడు. ఇక ఆర్థికంగా ఆసుపత్రుల్లో ఖర్చులు భరించలేక ప్రస్తుతం ఇంటివద్దే చికిత్స తీసుకుంటున్నాడు. సంతోష్ రెడ్డి పరిస్థితి తెలుసుకుని వారి 10వ తరగతి మిత్రులు ఇంటికెళ్ళి పరామర్శించి దాదాపు 38,500 రూపాయలు ఆర్థిక సాయం చేశారు. కాగా సంతోష్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి ఆరా తీస్తే లివర్ ట్రాన్స్ప్లాంటేషన్ కొరకు దాదాపు 40 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారని వారు చెపుతున్నారు.ఈ సందర్భంగా వారి తల్లితండ్రులు మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి తమ కుమారుడి పరిస్థితి చూసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు. అలాగే దాతలు ఆర్థిక సహాయం చేయాలనుకుంటే 9502501267 ఈ నంబర్ ను సంప్రదించాలని వారు కోరుతున్నారు.

## బడ్జెట్లో బీసీలకు అన్యాయం

**మిర్యాలగూడ, మార్చి 20, మన సాక్షి:**



బీసీలకు ప్రతి సంవత్సరం 20 వేల కోట్లు కేటాయిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం మాట తప్పి బీసీలకు అన్యాయం చేసిందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3.24 లక్షల కోట్ల బడ్జెట్లో బీసీలకు కేవలం రూ.12,511 కోట్లు మాత్రమే కేటాయించారని అన్నారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు కేవలం ఇంత తక్కువ బడ్జెట్ ఏ మూలకు సరిపోతుందని లింగంగౌడ్ ప్రశ్నించారు.బీసీ సబ్ ప్లాన్,బీసీ కార్పొరేషన్ల ఊసే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్ ను సవరించైనా బీసీలకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కకి విజ్ఞప్తి చేశారు.

## భారాస నేతలు డ్రగ్స్‌తో దొరుకుతుంటే మాట్లాడరేం?

### పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్:** ‘ఈగల్ టీం దాడిలో భారాస మాజీ ఎమ్మెల్యే, ఏపీకి చెందిన ఎంపీ పట్టుబడినా.. భాజపా నేతలు ఎందుకు మాట్లాడటం లేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రశ్నించారు. భాజపా, భారాస నేతలు ఎన్నికల్లోనే కాదు.. బయట కూడా కలిసి పని చేస్తున్నారని విమర్శించారు. విప్‌లు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ‘డ్రగ్స్ మీద మా ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతోంది. భారాస యువ నాయకుడి బ్యాచ్ మొత్తం డ్రగ్స్ కార్యక్రమాల్లో దొరుకుతున్నారు. ఇవన్నీ జరుగుతుంటే భాజపా నాయకులు ఎందుకు స్పందించడం లేదు? ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడితే ఆయన నోరు ఎందుకు మూయించారు. డ్రగ్స్ విషయంలో భాజపా నేతల వైఖరి ప్రజలకు చెప్పాలి’ అని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. శాసనమండలికి విప్‌లుగా నియమితులైన అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌లు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను గాంధీభవన్‌లో కలిసి ధన్యవాదాలు తెలిపారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమితులైన ఎర్రబెల్లి స్వర్ణ శుక్రవారం పార్టీ తెలంగాణ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## మంచిర్యాల జిల్లాలో వడగళ్ల వాన బీభత్సం

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలోని కాసిపేట, బెల్లంపల్లి మండలాల్లో, చెన్నూరు నియోజకవర్గం మందమర్రిలో వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం కురిసిన వడగళ్ల వర్షానికి మొక్కజొన్న, వరి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. కాసిపేట మండలంలోని పల్లంగూడ, కోమటిచేను, వరిపేట, కాసిపేట, ముత్యంపల్లి, పెద్దనపల్లి గ్రామాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. పలు నివాసాల పరిసరాలు, రహదారులు వడగళ్లతో నిండిపోయాయి. వర్షం కురిసిన గంటసేపటి వరకు వడగండ్లు కరగకుండా కనిపించాయి. అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్నాయని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.